

# విభారె

## తెలుగు దినపత్రిక

## VIBHARE TELUGU DAILY




PUBLISHED FROM KURNOOL ఎడిటర్: ఆవుల విజయ భాస్కర రెడ్డి శనివారం 04-06-2022 సంపుటి: 03 సంచిక: 256 పేజీలు: 4 వెల: రూ 3-00

# చంద్రబాబు అబద్ధాలు.. తప్పులు కప్పిపుచ్చుకోవడానికే..



అమరావతి: ప్రభుత్వంపై తప్పుడు విమర్శలు చేయడానికే చంద్రబాబు పరిమితమయ్యారని ఏపీ జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు మండిపడ్డారు. చంద్రబాబు దిగిపోయే ముందు వేలకోట్లు బకాయిలు పెట్టారన్నారు. బాబు పెట్టిన అప్పులన్నీ వైఎస్ జగన్ సీఎం అయ్యాక తీర్చారన్నారు. ప్రజలకు హామీలు ఇచ్చి ఎగొట్టిన గొప్ప నేత చంద్రబాబు అంటూ మంత్రి ఎద్దేవా చేశారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా ప్రధాని సహా కేంద్ర పెద్దలతో సీఎం జగన్ భేటీ అయ్యారు. పోలవరం సహా అనేక అంశాలను కేంద్రం దృష్టికి తీసుకెళ్లారని అంబటి రాంబాబు అన్నారు. “డ్వాక్రా మహిళల రుణాలు మాఫీ చేస్తానంటూ మోసం చేశారు. అబద్ధాలు చెప్పడంలో చంద్రబాబును మించినవాళ్లు లేరు. చంద్రబాబు నిర్వాకం వల్లే డయా ఫ్రమ్ వాల్ దెబ్బతింది. తన తప్పులు కప్పిపుచ్చుకోవడానికి మా ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నారని” మంత్రి అంబటి రాంబాబు దుయ్యబట్టారు.

# అచ్యుతాపురంలోని సెజ్‌లో గ్యాస్ లీక్!



అనకాపల్లి: అచ్యుతారపురంలో గ్యాస్ లీకేజీ ఘటన కలకలం రేపింది. సెజ్‌లోని పోరస్ కంపెనీ నుంచి అమ్మోనియం గ్యాస్ లీకైనట్టు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దీంతో పరిసర ప్రాంతాలకు చెందిన పలువురు అస్వస్థతకు గురయ్యారు. వాంతులు, తర తిరగడంతో తీవ్ర ఇబ్బంది పడ్డారు. బాధితులను యలమంచిలి, అనకాపల్లి

### పలువురికి అస్వస్థత



ప్రభుత్వాస్పత్రులకు తరలించారు. 20 అంబులెన్స్‌లతో ప్రభుత్వం సహాయక చర్యలు చేపట్టింది. జిల్లా కలెక్టర్ రవి సుభాష్ సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్నారు. గ్యాస్ లీకేజీ ఘటనపై హోంమంత్రి ఆరాఅనకాపల్లి గ్యాస్ లీకేజీ ఘటనపై హోంమంత్రి తానేటి వనిత ఆరా తీశారు. జిల్లా కలెక్టర్, ఎస్పీలతో హోంమంత్రి సమీక్షించారు. సహాయ చర్యలు ముమ్మరంగా చేపట్టాలని ఆమె ఆదేశాలు జారీ చేశారు. గ్యాస్ పీల్చి ఇబ్బందిపడ్డ 32 మంది బాధితులకు మెరుగైన వైద్య సహాయం అందించాలని, గ్యాస్ లీక్ అవుతున్న పరిశ్రమని అధికారులు కంట్రోల్ లోకి తీసుకోవాలని ఆదేశించారు.

# అరాచక పాలనలో మరో అమానవీయ ఘటన

### మహిళా పోలీసుల అమానవీయ ప్రవర్తన

### సిగ్గుచేటు : నారా లోకేష్

అమరావతి జూన్ 3 ‘కర్నూలు జిల్లా గూడూరు మండలం గుడిపాడులో మహిళా పోలీసుల అమానవీయ ప్రవర్తనతో సభ్యసమాజం తల దించుకుందన్నారు. తన ఇంటిముందు స్థలాన్ని పోలీసులతో వచ్చిన రెవెన్యూ సిబ్బంది స్వాధీనం చేసుకుంటుండగా మీనాక్షమ్మ, ఆమె కుమార్తె అడ్డుపడ్డారన్నారు. వారిని సాటి మహిళలు అని కూడా చూడకుండా మహిళా పోలీసులు తమ చున్నీలతో బంధించడం అరాచక పాలనలో మరో అమానవీయ ఘటనగా అభివర్ణించారు. దుర్మార్గ ప్రభుత్వ తీరును ప్రజలంతా ఒక్కటై నిలదీయాల్సిన సమయం ఆసన్నమైంది. ఇంకెన్నాళ్లీ దౌర్జన్యపాలన?... అని నారా లోకేష్ ప్రశ్నించారు. మీరు, మీ పార్టీ నేతలు, పోలీసులు, వలంటీర్లు చేస్తున్న అరాచకాల నుంచి రక్షించే యాప్ ఏదైనా ఉంటే ఆరంభించండి సీఎం సారూ!’ అంటూ ట్విటర్ వేదికగా టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ మొర పెట్టుకున్నారు.



# అనకాపల్లి గ్యాస్ లీకేజీ ఘటనపై సీఎం జగన్ ఆరా



అమరావతి: విశాఖపట్నం సమీపంలోని అచ్యుతాపురంలో అమ్మోనియా గ్యాస్ లీక్ ఘటనపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆరా తీశారు. ఘటనపై అధికారుల నుంచి వివరాలు కోరారు. ఘటనకు దారితీసిన కారణాలను సీఎంఓ అధికారులు వివరించారు. సంబంధిత జిల్లా కలెక్టర్ వెంటనే వెళ్లి సహాయ కార్యక్రమాలను పర్యవేక్షించారని అధికారులు వెల్లడించారు. గ్యాస్ లీక్‌ను కూడా నియంత్రించారని అధికారులు తెలిపారు. బ్రాండిక్స్‌లో ఒక యూనిట్‌లో పనిచేస్తున్న మహిళలను అందరిని ఖాళీ చేయించామని, అస్వస్థతకు గురైన వారిని ఆస్పత్రికి తరలించారని అధికారులు తెలిపారు. అంతా కోలుకుంటున్నారని, క్షేమంగా ఉన్నారని వివరించారు. అమ్మోనియా ఎక్కడ నుంచి లీకైందన్న అంశంపై అధికారులు దర్యాప్తు చేపట్టాం న్నారు. అస్వస్థతకు గురైన వారికి మంచి వైద్యాన్ని అందించాలని సీఎం ఆదేశించారు. ప్రమాదానికి కారణాలపై దర్యాప్తు చేసి, మళ్లీ ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని సంబంధిత శాఖ అధికారులకు సీఎం ఆదేశాలు జారీచే శారు. ఘటనా స్థలానికి వెళ్లాల్సిందిగా స్థానిక మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌ను సీఎం ఆదేశించారు. వెంటనే ఆయన విజయవాడ నుంచి అనకాపల్లి బయల్దేరి వెళ్లారు.

# హోంమంత్రి అమిత్‌షాతో సీఎం జగన్ భేటీ..

న్యూఢిల్లీ: ఢిల్లీ పర్యటనలో భాగంగా కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షాతో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమావేశమయ్యారు. రాష్ట్రానికి సంబంధించిన పలు అంశాలపై ఆయన చర్చించారు. సౌత్ జోనల్ కమిటీ సమావేశంలో భాగంగా ప్రస్తావించిన విభజన సమస్యలు–వాటి పరిష్కార ప్రక్రియపై ఇద్దరి మధ్య చర్చ జరిగింది. ఈ క్రమంలో ఇటీవల జరిగిన అధికారుల సమావేశాల అంశం కూడా ప్రస్తావనకు వచ్చింది. రాష్ట్ర విభజన జరిగి 8 ఏళ్లు పూర్తయినా ఇప్పటికీ ఆస్తుల పంపకం సహా విభజన సమస్యలన్నీ కూడా పెండింగులో ఉన్నాయని, వాటిని సత్వరమే పరిష్కరించాల్సిన అవసరం ఉందని సీఎం మరోమారు హోంమంత్రికి విజ్ఞప్తిచేశారు. దీంతో పాటు రాష్ట్రానికి చెందిన పలు అంశాలపైనకూడా సీఎం, హోంమంత్రితో చర్చించారు. ఢిల్లీ పర్యటన ముగించుకుని సీఎం జగన్ తిరిగి తాడేపల్లి చేరుకున్నారు. రాష్ట్ర అభివృద్ధి ఎజెండాగా కొనసాగిన ముఖ్యమంత్రి పర్యటనలో ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర మంత్రులు అమిత్ షా, నిర్మల సీతారామన్ , గజేంద్ర సింగ్ షెకావత్ తో సీఎం జగన్ భేటీ అయిన సంగతి తెలిసిందే.



# టెండర్‌లో ఆ నిబంధన పెట్టడం సిగ్గుచేటు:చంద్రబాబు

జగన్ సర్కార్ మూడేళ్ల రివర్స్ పాలనతో రాష్ట్రం 30 ఏళ్లు వెనక్కి పోయిందని టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు అన్నారు. శుక్రవారం ఆయన ఇక్కడ మీడియాతో మాట్లాడుతూ బిల్లుల కోసం కాంట్రాక్టర్లు కోర్టుకు వెళ్లకూడదని టెండర్‌లో నిబంధన పెట్టడం సిగ్గుచేటన్నారు. ప్రభుత్వ చర్య రాష్ట్ర పరువు తీసేలా ఉందని, దీనికి ముఖ్యమంత్రి సిగ్గుపడాలన్నారు. కాంట్రాక్టర్లను బిల్లుల కోసం కోర్టుకు వెళ్లవద్దని టెండర్ డాక్యుమెంట్‌లోనే నిబంధన పెట్టడం రాష్ట్ర దుస్థితికి, అసమర్థ పాలనకు నిదర్శనమన్నారు. కృష్ణా డెల్టా కాలువల మరమ్మతుల టెండర్‌లో బిల్లుల కోసం ఒత్తిడి తేవొద్దని ప్రభుత్వం పేర్కొన్న నిబంధనలు రాష్ట్రం పరువు తీశాయన్నారు. కాంట్రాక్టర్లు చేసిన పనిలో బిల్లుల కోసం కోర్టుకు వెళ్లవద్దనే నిబంధన పెట్టడం దేశంలో మరే రాష్ట్రంలోను లేదన్నారు. న్యాయం కోసం కోర్టుకు వెళ్లే హక్కు లేదనే నిబంధన పెట్టే హక్కు అసలు జగన్ ప్రభుత్వానికి ఎక్కడ ఉందని ప్రశ్నించారు. రాష్ట్రంలో లక్షన్నర కోట్ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని, కాంట్రాక్టర్లపై, ఆయా సంస్థల్లో పనిచేసే ఉద్యోగులు, సిబ్బందిపై ఎంత ప్రభావం చూపుతుందో ఈ మూర్ఖపు ప్రభుత్వానికి అర్థం కాదని చంద్రబాబు వ్యాఖ్యానించారు. ప్రభుత్వం బిల్లులు ఇవ్వని కారణంగా నిర్మాణ, వ్యాపార, సేవల రంగంలో లక్షల మంది ఉపాధి కోల్పోవడానికి జగన్ కారణం అయ్యారని ఆరోపించారు.

# రాజ్యసభ ఎన్నికలు ఏకగ్రీవం..

# 4 స్థానాలు వైఎస్సార్‌సీపీ కైవసం

అమరావతి: ఏపీలో రాజ్యసభ ఎన్నికలు ఏకగ్రీవమయ్యాయి. నాలుగు రాజ్యసభ స్థానాలు వైఎస్సార్‌సీపీ కైవసం చేసుకుంది. రాజ్యసభకు విజయసాయిరెడ్డి, బీద మస్తాన్‌రావు, ఆర్ కృష్ణయ్య, నిరంజన్‌రెడ్డి ఎన్నికయ్యారు. ఎన్నికైనట్లు రిటర్నింగ్ అధికారి డిక్లరేషన్ అందించారు. అనంతరం.. వైఎస్సార్‌సీపీ ఎంపీలు మీడియాతో మాట్లాడుతూ, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అజెండా మేరకు పనిచేస్తామని తెలిపారు. ఏపీ అభివృద్ధి కోసం అంతా సమిష్టిగా కృషి చేస్తామని పేర్కొన్నారు. అన్ని వర్గాల అభివృద్ధి కోసం సీఎం జగన్ పనిచేస్తున్నారన్నారు. సీఎం జగన్ తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటామన్నారు.

రాజ్యసభకు ఎన్నికైన వైఎస్సార్‌సీపీ ఎంపీల నేపథ్యం ఇదే..

ఆర్ కృష్ణయ్య: ప్రముఖ బీసీ సంఘ ఉద్యమ నేత. సెప్టెంబర్ 13, 1954 వికారాబాద్ జిల్లా మొయిన్‌పేట మండలం రాళ్ళడుగుపల్లిలో జన్మించారు. ఎంఏ, ఎంఫిల్‌తో పాటు న్యాయ విద్యను సైతం అభ్యసించారు. ఎల్‌ఎల్‌ఎంలో గోల్డ్ మెడల్ దక్కించుకున్నారు కూడా. విద్యార్థి దశ నుంచే చురుకుగా ఉద్యమాల్లో పాల్గొంటున్నారు. నిరుద్యోగుల కోసం 12 వేలకు పైగా ఉద్యమాలు.. పోరాటాలతో రెండు వేలకు పైగా జీవోలు సాధించిన ఉద్యమ నేతగా ఆర్.కృష్ణయ్యకు గుర్తింపు. ఎస్సీ, ఎస్టీ, బీసీల తరపున పోరాటాల్లో పాల్గొన్నారు ఆర్ కృష్ణయ్య. నిరుద్యోగులు, విద్యార్థులు, ఉద్యోగుల తరపున నిరంతర ఉద్యమాల్లో పాల్గొన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ కోసం సైతం పోరాటాలు చేశారు. 1994లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో బీసీ సంక్షేమ సంఘం ఏర్పాటు కాగా, రాష్ట్ర బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా.. ప్రస్తుతం జాతీయ బీసీ సంఘం అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. క్రియాశీలక రాజకీయాల్లో అడుగుపెట్టి.. 2014లో ఎల్బీనగర్ నుంచి ఎమ్మెల్యేగా గెలిచారు. 2018లో నల్లగొండ జిల్లా మిర్యాలగూడ నుండి ఎమ్మెల్యేగా కూడా పోటీ చేశారు.

బీద మస్తాన్‌రావు: ప్రముఖ వ్యాపారవేత్త, వైఎస్సార్‌సీపీ నేత బీద మస్తాన్‌రావు.. జులై 2, 1958లో పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా అల్లూరు మండలం ఇస్కపల్లి గ్రామంలో జన్మించారు. విద్యార్హత బీకాం, సీఏ(ఇంటర్). బీసీ యాదవ కమ్యూనిటీకి చెందిన వ్యక్తి. స్థానికంగా రాజకీయ నేపథ్యం ఉన్న కుటుంబం ఈయనది. చెన్నైలో ఓ ప్రముఖ హోటల్ గ్రూప్‌నకు ఫైనాన్షియల్ మేనేజర్‌గా పని చేసిన బీద మస్తాన్‌రావు.. అనతి కాలంలోనే ఆక్వా రంగంలో అంతర్జాతీయ స్థాయికి ఎదిగారు. బోగోల్ మండలం జెడ్‌పీటీసీ సభ్యుడిగా రాజకీయాల్లోకి అడుగుపెట్టి.. ఎమ్మెల్యేగానూ పని చేశారు. బీసీ సంక్షేమ కమిటీ సభ్యుడిగా, కార్మిక, పరిశ్రమల, ఉపాధి శిక్షణ, పర్యాటక, సాంకేతిక సమాచార విభాగాల స్టాండింగ్ కమిటీ చైర్మన్‌గానూ పనిచేశారు. 2019లో నెల్లూరు లోక్ సభ స్థానానికి పోటీ చేశారు కూడా. 2014 నుంచి 19 మధ్య క్యాపిటల్ రీజియన్ డెవలప్‌మెంట్ అథారిటీ అడ్వైజరీ మెంబర్‌గానూ పనిచేశారు. రాజకీయాలు, వ్యాపారాలతో పాటు సామాజిక సేవ, ఆధ్యాత్మిక, సేవా కార్యక్రమాలతోనూ గుర్తింపు దక్కించుకున్నారు.

విజయసాయి రెడ్డి: వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి వి. విజయసాయి రెడ్డి. పూర్తి పేరు వేణుంబాక విజయసాయిరెడ్డి. 1957 జూలై 1న నెల్లూరు జిల్లా, తాళ్ళపూడి గ్రామంలో జననం. చెన్నైలో చార్టెడ్ అకౌంటెంట్ చేసిన విజయసాయిరెడ్డి.. ఓరియంటల్ బ్యాంక్ ఆఫ్ కామర్స్ డైరెక్టర్ గా పనిచేశారు. రెండుసార్లు వరుసగా టీటీడీ సభ్యుడిగా ఎన్నికయ్యారు. వైఎస్సార్‌సీపీ తరపున ఏకగ్రీవంగా ఇంతకు ముందు రాజ్యసభకు ఎన్నికై.. 22వ తేదీ



జూన్ 2016 నుంచి 21 జూన్ 2022 వరకు రాజ్యసభ ప్రాతినిధ్యం వహించారు. రాజ్యసభలో 10 ప్రైవేట్ మెంబర్ బిల్లులను ప్రవేశపెట్టారు విజయసాయి రెడ్డి(64). అంతేకాదు.. రూల్స్, పెట్రోలియం ఓ సహజ వాయువు స్టాండింగ్ కమిటీలోనూ సభ్యుడిగా పని చేశారు.

నిరంజన్ రెడ్డి: సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది. తెలుగు రాష్ట్రాల్లో అత్యంత అనుభవం ఉన్న న్యాయ నిపుణుల్లో ఒకరు. జులై 22 1970 అదిలాబాద్ జిల్లా నిర్మల్ పట్టణంలో జననం. వ్యవసాయ నేపథ్యం ఉన్న కుటుంబం ఈయనది. హైదరాబాద్‌లోనే ఉన్నత విద్యంతా పూర్తి. పుణెలోని ప్రఖ్యాత న్యాయ కళాశాల సింబియాసిస్‌లో న్యాయవిద్య అభ్యసించించారు నిరంజన్‌రెడ్డి. ఉమ్మడి తెలుగు రాష్ట్రంలో 1992 నుంచి హైకోర్టు అడ్వొకేట్‌గా ప్రాక్టీస్. 1994–95 మధ్య సుప్రీం కోర్టులో ప్రాక్టీస్ మొదలు పెట్టారు. రాజ్యాంగపరమైన అంశాలతోపాటు వేర్వేరు చట్టాలపై మంచి పట్టున్న న్యాయవాదిగా గుర్తింపు దక్కించుకున్నారు.

# సంపాదకీయం

శనివారం 04-06-2022

## ఓ వైపు ధరలు.. మరో వైపు అవినీతి

దేశం సిస్టంలో అవినీతి ఒక భాగం అయిపోయింది. పేదరికం 80 శాతం పెరిగింది. 94.11 శాతం మంది ఆదాయం 10 వేల రూపాయల కన్నా తక్కువకు దిగజారింది. ధరల భారం దేశంలోని ప్రతి కుటుంబం పైనా అదనంగా 7,500 రూపాయల మేరకు పడింది. షేర్ బజార్ నుంచి 1,65,000 కోట్ల విదేశీ పెట్టుబడులను ఉపసంహరించుకున్నారు. ప్రజల ఆదాయం 2021లో 50 శాతం పడిపోతే, ఈ ఏడాది జనవరి వరకు 60 శాతం పడిపోయినట్లు లెక్కలు చెబుతున్నాయి. ఆర్‌బీఐ అంచనా ప్రకారం 2034-35 వరకు కూడా అధిక ధరల పరిస్థితి మారే సూచనలు లేవు. అదానీ, అంబానీల మాదిరిగా ప్రజాప్రతినిధుల ఆస్తులు పెరిగాయి. బీజేపీ లాంటి పార్టీలకు ఫండ్స్ పెరిగాయి. దేశం ఆర్థిక పరిస్థితి కుదేలయ్యింది. వాస్తవాలను కేంద్రం అంగీకరించే పరిస్థితి లేదు. బీజేపీ గద్దె దిగినా, దేశం ఆర్థిక పరిస్థితి గాడిలో పడడానికి మరో దశాబ్దం పట్టక తప్పదంటున్నారు ఆర్థిక నిపుణులు. అబద్ధాలు, అమలు కాని హామీలు రాజకీయాలలో ఎలా సహజం అయిపోయాయో, అవినీతి, అక్రమాలు, ఆశ్రిత పక్షపాతాలు కూడా నేతలకు సహజం అయిపోయాయి. అయిదేండ్లలో ప్రజాప్రతినిధుల ఆస్తులు ఐదు నుంచి పదింతలు పెరుగుతున్నాయి. ఆదాయానికి మించి సంపాదన 85 శాతం ప్రజా ప్రతినిధులలో స్పష్టంగా కనిపిస్తున్నది. అవినీతికి పాల్పడ్డారని పంజాబ్ ఆరోగ్య శాఖ మంత్రి విజయ్ సాంగ్లీని తాజాగా సీఎం భగవంత్‌మాన్ కేబినెట్ నుంచి తొలగించారు. ఆయన మీద కేసు పెట్టి జైలుకు పంపారు. అవినీతి నేతలుగా ముద్రపడిన ఇలాంటివారు తమ రాజకీయాలను కొనసాగిస్తూనే ఉంటారు. తమకున్న డబ్బు, హంగూ, ఆర్భాటంతో ఎన్నికలలో విజయం సాధిస్తూనే ఉంటారు. అవినీతి, అక్రమాలు, మితిమీరిన సంపాదన దేశ రాజకీయ నాయకులకు షరా మాములు అయిపోయాయి. 'ఎవరిని చూసినా ఏమున్నది గర్వకారణం?' అనే విధంగా ఉంది పరిస్థితి. ఫలానా రాజకీయ పార్టీలో ఫలానా నేత 'దూద్ కా ధులా హువా నేతా హై' అని చెప్పుకోవడానికి ఈ కాలంలో ఎవరూ లేరు. కానీ, వారి ఫొటోలకు మాత్రం కార్యకర్తలు పాలాభిషేకం చేస్తూనే ఉంటారు. పాల ధర కూడా ఆకాశాన్నంటిన మన దేశంలో ఇది కామన్ అయిపోయింది. కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు అధికార, విపక్ష నేతలందరిదీ ఇదే పరిస్థితి. అందుకే, పాలకులు ఎక్కడ ఈడీ, సీబీఐ తదితర కేసులు పెట్టి అరెస్ట్ చేయిస్తారో అనే భయంతో నాయకులు వ్యవహారం నడుపుతుంటారు. 'పాము చావొద్దు-కర్ర విరగొద్దు' అనే తీరుగ వారి మాటలు ఉంటాయి. నిజానికి మనీ లాండరింగ్, లంచం, అక్రమాలు, ఆదాయానికి మించి ఆస్తులకు సంబంధించిన కేసులు ఉన్న వారంతా జైలులో ఉంటే, వారికి అయిదేండ్ల కన్నా ఎక్కువ శిక్షలు పడే అవకాశం ఉంటే ఈ దేశ రాజకీయాలు మారిపోయేవి. రాజకీయాలలో కొంతలో కొంత అయినా నిజాయితీపరుల ప్రవేశాన్ని మనం చూడగలిగేవారం. కానీ, అలా జరుగదు ఎందుకంటే విపక్ష నేతలు అయినా, అధికార నేతలు అయినా ఎవ్వరూ కేసులకు అతీతులు కారు కాబట్టి అంతా కలిసిమెలిసే ఉంటారు. అధికారంలో ఉన్న పార్టీలో చేరితే కేసులన్నీ మాఫ్ లేదా పెండింగ్. బెంగాల్, కర్ణాటక, మధ్యప్రదేశ్, ఝార్ఖండ్, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఉత్తరప్రదేశ్, బిహార్, గుజరాత్, గోవా, జమ్మూ-కాశ్మీర్, రాజస్థాన్, తమిళనాడు ఇలా దాదాపు 12 రాష్ట్రాలలోనూ ఇదే పరిస్థితి ఉంది. బిహార్ మాజీ సీఎం లాలూ ప్రసాద్ యాదవ్ కుటుంబం సభ్యులందరూ ఈడీ, సీబీఐ కేసులను ఎదుర్కొంటున్నారు. తమిళనాడు దివంగత సీఎం జయలలిత కూడా కేసులు ఎదుర్కొన్నారు. డీఎంకే, ఏఐడీఎంకే, నేతలు, బీఎస్‌పీ నేత మాయావతి, యూపీ మాజీ సీఎం అఖిలేశ్ యాదవ్, కాంగ్రెస్ నేత హుడా, కేంద్ర మాజీ మంత్రి చిదంబరం, మహారాష్ట్రలో శివసేన, కేంద్ర మాజీ మంత్రి శరద్‌పవార్, బెంగాల్ సీఎం మమతా బెనర్జీ బంధువులు, పార్టీ నేతలు, జార్ఖండ్ సీఎం హేమంత్ సొరైన్, ఏపీ సీఎం జగన్‌మోహన్ రెడ్డి ఇలా చాలా మంది నేతల మీద కేసులు ఉన్నాయి. అధికారంలో ఉన్నవారు తమని తాము నిజాయితీపరులుగా చెప్పుకోవడానికి అప్పుడప్పుడు విపక్షాల కేసులను బయటికి తీసి బెదిరిస్తుంటారు. ఇప్పుడు మంత్రులుగా ఇప్పుడు కొనసాగుతున్నవారి పేర్లు కూడా ఇందులో ఉంటాయి. అయితే, వారిని వారు కాపాడుకుంటారు. విపక్షాల మీద దీనిని ప్రయోగిస్తుంటారు. నిజానికి ఆరోపణలు లేనివారు 40 నుంచి 45 శాతం మాత్రమే ఉంటారు. కేంద్ర హోమ్ శాఖ సహాయ మంత్రి అజయ్ మిశ్రా తేని తనయుడు ఆశీష్ మీద రైతులను వాహనంతో ఢీకొట్టి చంపిన కేసు ఉంది. ఆశీష్ ఇప్పుడు జైలులోనే ఉన్నాడు. మహారాష్ట్రలోనూ మాలిక్ అనే మంత్రి జైలులోనే ఉన్నాడు. దీనికి తోడు 80-20 మందిర్, మస్జిద్ రాజకీయాలు అదనం. రెచ్చగొట్టే ఉపన్యాసాలు, లవ్ జిహాద్ పేరిట దాడులు ఇలా నేరాలలో భాగస్వాములుగా ఉండే నేతలకు కొదువ లేదు. ప్రముఖ నేతల మీద 122 ఈడీ, 173 సీబీఐ కేసులు ఉన్నాయి. ఇందులో 71 మంది ఎమ్మెల్యేలు, 91 మంది ఎంపీలు ఉన్నారు. కొందరు మాజీ ప్రజాప్రతినిధులు, మంత్రులు కూడా ఉన్నారు. చాలా మంది రాజకీయ పార్టీ నేతల నెత్తి మీద తల్వార్ మాదిరి కేసులు వేలాడుతున్నాయి. కేంద్ర మాజీ మంత్రి దాసరి నారాయణరావు మీద కోల్ స్కామ్ కేసు ఆయన మరణించే దాకా వేలాడింది. ఈ జాబితా చాంతాడంత ఉంది. రాసుకుంటూ పోతే డబుల్ ఇంటర్‌వెల్ ఇచ్చిన 'సంగం' సినిమా స్టోరీ అవుతుంది. అందుకే 'పాలిటిక్స్ ఈస్ ద స్కౌండ్రల్స్ గేమ్' అన్నాడో పెద్దమనిషి. వీరు దేశాన్ని ఎలా కాపాడుతారు? వీరేం దేశానికి దిశా నిర్దేశం చేస్తారు? ప్రశ్నించేవారిని, తప్పులను ఎత్తిచూపేవారిని, అన్యాయాన్ని అడ్డుకునేవారిని దేశద్రోహులంటున్నారు. రాజ్యాంగం ఇచ్చిన భావ ప్రకటనా స్వేచ్ఛను జైలులో పెడుతున్నారు. ప్రజలను మోసం చేస్తున్న నేతలకు చరమ గీతం పాడాలి. అందుకు బుద్ధిజీవులు ముందుకు రావాలి.

## నేడు గాన గంధర్వుడు ఎస్.పి.బాలసుబ్రహ్మణ్యం జయంతి



ఎస్పి బాలసుబ్రహ్మణ్యం నేపథ్య గాయకుడు, సంగీత దర్శకుడు, నటుడు, టెలివిజన్ వ్యాఖ్యాత. తెలుగు, తమిళ, కన్నడ, హిందీ లాంటి భాషల్లో సుమారు 40 వేలకు పైగా పాటలు పాడారు. అతడి పూర్తి పేరు శ్రీపతి పండితారాధ్యుల బాలసుబ్రహ్మణ్యం. బాలసుబ్రహ్మణ్యం 1946, జూన్ 4 న నెల్లూరు జిల్లా కోనేటమ్మపేట గ్రామంలో సాంప్రదాయ శైవ తెలుగు బ్రాహ్మణ కుటుంబానికి చెందిన శ్రీపతి పండితారాధ్యుల సాంబమూర్తి, శకుంతలమ్మ దంపతులకు జన్మించాడు. అతన్ని ఎస్పీబీ అని కూడా పిలవడం కద్దు. అభిమానులు ఆయనను ముద్దుగా బాలు అని పిలుస్తారు. 1966 లో పద్మనాభం నిర్మించిన శ్రీ శ్రీ శ్రీ మర్యాద రామన్న చిత్రంతో సినీ గాయకుడిగా అతని ప్రస్థానం ప్రారంభమైంది. తర్వాత మరిన్ని అవకాశాలు తలుపు తట్టాయి. మొదట్లో ఎక్కువగా తెలుగు, తమిళ చిత్రాల్లో పాటలు పాడే అవకాశాలు వచ్చాయి. చాలా మంది నటులకు వారి హావభావాలకు, నటనా శైలికి అనుగుణంగా పాటలు పాడేవాడు. 1969 లో మొదటిసారిగా నటుడిగా కనిపించిన ఈయన తర్వాత కొన్ని అతిథి పాత్రల్లో నటించాడు. తర్వాత అనేక తమిళ, తెలుగు చిత్రాల్లో సహాయ పాత్రలు పోషించాడు. ప్రేమ (1989), ప్రేమికుడు (1994), పవిత్రబంధం (1996), ఆరో ప్రాణం (1997), రక్షకుడు (1997), దీర్ఘ సుమంగళీ భవ (1998) మొదలైనవి ఆయన నటించిన కొన్ని సినిమాలు. బాలు డబ్బింగ్ ఆర్టిస్టుగా అనేకమంది కళాకారులకు గాత్రదానం చేశారు. కమల్ హాసన్, రజనీకాంత్, సల్మాన్ ఖాన్, విష్ణువర్ధన్, జెమిని గణేశన్, గిరీష్ కర్నాడ్, అర్జున్, నగేష్, రఘువరన్ లాంటి వాళ్ళకి గాత్రదానం చేసారు. సినిమాల్లోనే కాక టి.వి రంగంలో ఆయన పాడుతా తీయగా, పాడాలని ఉంది లాంటి కార్యక్రమాలను నిర్వహించి ఎంతోమంది నూతన గాయనీ గాయకులను పరిచయం చేశారు. ఇవి కాకుండా ఈటీవీలో ప్రసారమైన స్వరాభిషేకం లాంటి కార్యక్రమాల్లో తన గానాన్ని వినిపించారు. అతను కేంద్ర ప్రభుత్వం నుండి 2001 లో పద్మశ్రీ పురస్కారాన్ని, 2011 లో పద్మభూషణ్ పురస్కారాన్ని అందుకున్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నుంచి 25 సార్లు వివిధ విభాగాల్లో నంది పురస్కారం అందుకున్నారు. ఇంకా తమిళనాడు, కర్ణాటక రాష్ట్రప్రభుత్వాల నుంచి కూడా పలు పురస్కారాలు అందుకున్నారు. భారతీయ భాషల్లో ఆయన సుమారు 40 వేలకు పైగా పాటలు పాడాడు. అత్యధిక పాటలు రికార్డు చేసిన గాయకుడిగా ఆయన పేరిట ఒక రికార్డు ఉంది. ఆయన సుదీర్ఘ ప్రస్థానంలో 6 జాతీయ పురస్కారాలు, 6 ఫిల్మ్ ఫేర్ దక్షిణాది పురస్కారాలు, ఒక ఫిల్మ్ ఫేర్ పురస్కారం అందుకున్నారు. . 1979 లో వచ్చిన సంగీత ప్రధానమైన శంకరాభరణం చిత్రానికి ఆయనకు జాతీయ పురస్కారం లభించింది. రెండు సంవత్సరాల తర్వాత ఆయనకు 1981 లో బాలీవుడ్ లో ప్రవేశించి ఏక్ దూజే కేలియే చిత్రానికి గాను రెండోసారి పురస్కారాన్ని అందుకున్నారు. . తర్వాత సాగర సంగమం (1983), రుద్రవీణ (1988) చిత్రాలకు జాతీయ పురస్కారాలు అందుకున్నాడు. 25 సార్లు ఉత్తమ గాయకుడిగా, ఉత్తమ సంగీత దర్శకుడిగా, ఉత్తమ డబ్బింగ్ ఆర్టిస్టుగా, ఉత్తమ సహాయ నటుడిగా నంది పురస్కారాలు అందుకున్నారు. ఇంకా తమిళనాడు, కర్ణాటక రాష్ట్రప్రభుత్వాల నుంచి కూడా పలు పురస్కారాలు అందుకున్నారు. 2020 ఆగస్టు 5 న ఎస్పీ బాల సుబ్రహ్మణ్యం తనకు కోవిడ్-19 వ్యాధి సోకినట్టు వెల్లడించారు. చికిత్స నిమిత్తం చెన్నైలోని ఎంజీఎం ఆస్పత్రిలో చేరారు. ఆ తరువాత కరోనా తగ్గినప్పటికీ ఇతర శ్వాసకోశ సమస్యలు ఏర్పడి ఆరోగ్యం విషమించడంతో ఎక్మో, వెంటిలేటర్ సాయంతో చికిత్స కొనసాగించారు. 2020 సెప్టెంబరు 25 న మధ్యాహ్నం 1.04 లకు బాలు తుదిశ్వాస విడిచారు. 2020 సెప్టెంబరు 26న తిరువళ్ళూరు జిల్లాలోని రెడ్ హిల్స్, తామరపాకం లోని ఆయన వ్యవసాయం క్షేత్రంలో తమిళనాడు ప్రభుత్వం ఆధ్వర్యంలో అంత్యక్రియలు జరిగాయి. 2021లోమరణానంతరం కేంద్ర ప్రభుత్వం బాలుకు పద్మ విభూషణ్ పురస్కారాన్ని ప్రకటించింది.

## టీడీపీకి అనుకున్నంత ఈజీయే కాదు



విజయవాడ, జూన్ 3, తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబుకు రానున్న ఎన్నికలు సవాల్ అని చెప్పక తప్పదు. వచ్చే ఎన్నికలు పార్టీ మనుగడను కూడా ప్రశ్నార్థకం చేస్తాయి. అధికారం మరోసారి దక్కకపోతే పార్టీ మనుగడ కూడా కష్టసాధ్యమే అవుతుంది. అందుకే చంద్రబాబు తనకు శక్తికి మించి అన్ని ప్రయత్నాలు చేస్తున్నారు. ఇప్పటికే పార్టీ నేతల్లోనూ, క్యాడర్ లోనూ కొంత విశ్వాసాన్ని అయితే నింపగలిగారు. కానీ ప్రజలలో మాత్రం ఇంకా విశ్వాసాన్ని నింపలేకపోతున్నారు. అందుకు అనేక కారణాలున్నాయి. చంద్రబాబు నాయకత్వంపై నమ్మకం ఉన్నప్పటికీ ఆయన చెప్పే మాటలకు, ఇచ్చే హామీలకు విశ్వసనీయత లేకపోవడం. దివ్యవాణి వంటి నేతలు పార్టీని వీడటం కూడా పార్టీకి ఇబ్బంది కలిగించేవే. ఆమె చెప్పినట్లుగానే బాబు కొందరి చేతుల్లో బందీ అయ్యారన్నది కాదనలేని వాస్తవం. క్షేత్రస్థాయి నుంచి వచ్చిన సమాచారాన్ని కొందరు పార్టీ నేతలు చంద్రబాబును తప్పుదోవ పట్టిస్తున్నారన్న దివ్యవాణి మాటల్లో నిజం లేకపోలేదు. అది సరిచేసుకునే వయసు చంద్రబాబుది కాదన్నది కూడా అంతే నిజం. చంద్రబాబుకు సమర్థ నాయకుడిగా పేరుంది. మంచి అడ్మినిస్ట్రేషర్ గా కూడా ఆయన గుర్తింపు పొందారు. దానిని ఎవరూ కాదనలేరు. ఆయన విజన్ ను కూడా ఎవరూ తప్పుపట్టలేరు. కానీ సంక్షేమ పథకాలకు వచ్చే సరికి ఆయనపై పేద, దిగువ, మధ్య తరగతి ప్రజల్లో విశ్వాసం లేదు. ముఖ్యంగా జగన్ అమలు పర్చే వివిధ పథకాలను, కార్యక్రమాలను చంద్రబాబు అధికారంలోకి వస్తే కొనసాగించరన్న నమ్మకం ప్రజల్లో ఉంది. జగన్ వివిధ పథకాల ద్వారా నగదు రూపంలో ఇచ్చే పథకాలు కావచ్చు. ముఖ్యంగా ఆరోగ్య శ్రీ విషయంలో కావచ్చు చంద్రబాబు కొనసాగించరన్న నమ్మకం ఆ వర్గాల ప్రజల్లో బలంగా ఉంది. దాదాపు మూడున్నర కోట్ల మంది వివిధ పథకాల ద్వారా లబ్ది పొందుతున్నారు. మధ్య, ఎగువ తరగతి ప్రజల్లో వైసీపీ పట్ల వ్యతిరేకత కన్పిస్తుంది. అయితే వారిలో ఎంత మంది పోలింగ్ కేంద్రాలకు వస్తారన్నది సందేహమే. ఎందుకంటే వారికి ఎన్నికలపై పెద్దగా నమ్మకం లేకపోవడం, క్యూలైన్లలో నిలబడి నిరీక్షించే ఓపిక లేకపోవడం వంటి కారణాలు ఆ వర్గాలు ఓటింగ్ కు కొంత దూరంగా ఉంటూ వస్తున్నట్లు గత ఎన్నికల పోలింగ్ తీరు చెబుతుంది. ఇక ఉద్యోగస్థుల్లో కొంత వ్యతిరేకత కన్పిస్తుంది. అయినా ఆర్టీసీ వంటి ఉద్యోగులు చంద్రబాబు తమను ప్రభుత్వంలో కొనసాగిస్తారన్న నమ్మకం లేదు. అందుకే ఆర్టీసీ ఉద్యోగులతో పాటు, మరికొన్ని సంస్థల ఉద్యోగులు చంద్రబాబు సంస్కరణల వైపు మొగ్గు చూపుతారన్న సందేహంతో వారు తిరిగి సైకిల్ కు ఓటు వేసే ధైర్యం చేయరన్న విశ్లేషణలు వెలువడుతున్నాయి. ప్రభుత్వ వ్యతిరేక ఓటు భారీగా ఉన్నప్పుడు మాత్రమే విజయం సాధ్యమవుతుంది. దీంతో పాటు స్థానిక ఎమ్మెల్యేల పట్ల ఉన్న వ్యతిరేక కూడా ప్రతిపక్ష పార్టీకి అనుకూలంగా మారతాయి. రెండేళ్ల సమయంలో జగన్ ఆ వ్యతిరేకతను కొంత తగ్గించే చర్యలు చేపట్టే వీలుంది. గతంలో చంద్రబాబు మహాకూటములు ఏర్పాటు చేసినా ఆయన విజయం సాధించలేకపోయారన్న వాదన ఎటూ ఉండనే ఉంది. ఈసారి కూడా అన్ని రాజకీయ పార్టీలు ఏకమయినా తమ విజయం ఖాయమన్న ధీమాలో వైసీపీ ఉంది. అయితే చంద్రబాబు ఈసారి తనకు చివరసారి ఛాన్స్ ఇవ్వాలని ప్రజల ముందుకు వెళ్ళనున్నారు. ఏది ఏమైనా వచ్చే ఎన్నికల్లో నెగ్గుకు రావడం చంద్రబాబుకు అంత సులువు కాదు. జగన్ పై అన్ని వర్గాల ప్రజల్లో వ్యతిరేకత తీవ్రమై అది పోలింగ్ కేంద్రాల వరకూ వస్తేనే బాబుకు విజయం సాధ్యమవుతుందన్నది విశ్లేషకుల అభిప్రాయం. మరి రానున్న కాలంలో ఏం జరుగుతుందో చూడాలి.

## వైసీపీ ముందస్తు సన్నాహాలా..?



గుంటూరు జూన్ 3, వైసీపీ ముందస్తు సన్నాహాలు ప్రారంభించేసిందా. ఒక వైపు గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం విఫలం కావడం, మంత్రుల బస్సు యాత్ర తుస్సు మనడం.. మరో వైపు తెలుగుదేశం బాదుడే బాదుడు కార్యక్రమానికి జన స్పందన బ్రహ్మాండంగా ఉండటం, తెలుగుదేశం మహానాడు అంచనాలకు మించి విజయవంతం కావడంతో ఏపీలో అధికార వైసీపీకి ఉక్కపోత ప్రారంభమైంది. దీంతో ప్రజలలో తమ పట్టు సడలలేదని నిరూపించుకోవడానికి నానా తంటాలూ పడుతోందిక్రమశిక్షణా సంఘం సిఫారసు అంటూ మాజీ మంత్రి కొత్తపల్లిపై సస్పెన్షన్ వేటు వేయడం ద్వారా పార్టీకి వ్యతిరేకంగా మాట్లాడితే సహించేది లేదన్న సందేశాన్ని పార్టీ శ్రేణులకు ఇచ్చింది. అయితే ప్రజాభిమానం చెక్కు చెదరలేదని నిరూపించుకోకుంటే.. పార్టీ నుంచి వలసనలు పెరుగుతాయన్న భయం మాత్రం పార్టీని వెంటాడుతోంది. దీంతో పార్టీ ప్లీనరీ నిర్వహించి సత్తా చాటాలని, తద్వారా ముందస్తు సన్నాహాలు ప్రారంభించాలని వైసీపీ అధినేత జగన్ నిర్ణయించారు. ఇందుకు ముహూర్తం కూడా ఖరారు చేసేశారు. వైస్ జయంతి రోజైన జూలై 8 నుంచి రెండు రోజుల పాటు వైసీసీ ప్లీనరీ నిర్వహించాలని జగన్ నిర్వహించారు. 2017లో వైసీపీ ప్లీనరీ నిర్వహించిన గుంటూరు జిల్లాలో నాగార్జున వర్సిటీ ఎదురుగా ఉన్న స్థలంలోనే ఈ సారి కూడా ప్లీనరీ నిర్వహణకు జగన్ నిర్ణయించారు. బుధవారం తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో పార్టీ ముఖ్యనేతలతో సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. తెలుగుదేశం మహానాడును మించి వైసీపీ ప్లీనరీ విజయివంతమయ్యేలా చర్యలు తీసుకోవాలని జగన్ పార్టీ ముఖ్య నేతలకు స్పష్టమైన ఆదేశాలిచ్చినట్లు చెబుతున్నారు. జన సమీకరణ విషయంలో ఎటువంటి రాజీ వద్దనీ, పెద్ద సంఖ్యలో జనం ప్లీనరీకి హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని చెప్పినట్లు వైసీసీ వర్గాలు చెబుతున్నాయి. ప్లీనరీ నిర్వహణకు కమిటీల ఏర్పాటు బాధ్యతను ప్రభుత్వ సలహాదారు సజ్జలకు అప్పగించారు. వచ్చే మూడు నాలుగు రోజులలో ప్లీనరీ కమిటీల ఏర్పాటు జరుగుతుందని సజ్జల జగన్ కు చెప్పినట్లు తెలుస్తోంది. వైసీపీ సభలకు జనం రావడం లేదన్న ప్రచారానికి ప్లీనరీతో ఫుల్ స్టాప్ పడేలా జనసమీకరణ ఉండాలని జగన్ స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. ప్లీనరీతో వైసీపీకి జనంలో అభిమానం చెక్కు చెదరలేదని చాటాలని జగన్ ముఖ్యనేతలకు చెప్పినట్లు పార్టీ వర్గాలు తెలియజేశాయి.

## విద్యా సంస్థలకు జగన్ మార్క్ కు షాక్...

విజయవాడ,జూన్ 3,పదో తరగతి ఫలితాలు విడుదలయ్యాక ఏ విద్యాసంస్థలూ మాకు ఇన్ని ర్యాంకులు వచ్చాయి. టెన్ ఆఫ్ టెన్ ఇంత మందికి వచ్చింది, అంత మందికి వచ్చింది అంటూ ప్రకటనలు ఇవ్వడం, ఫలితాలపై ప్రచారం చేసుకోవడం, నిషిద్ధమని, ఏపీ పాఠశాల విద్యాశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బి. రాజశేఖర్ ఉత్తర్వులు జారీ చేశారు. విద్యార్థుల తల్లిదండ్రులు, వివిధ వర్గాల నుంచి వచ్చిన విజ్ఞప్తుల మేరకు ప్రభుత్వం ఈ మేరకు నిర్ణయం తీసుకుందని చెప్పారు. టెన్త్ పరీక్షల ఫలితాల విడుదలలో గతంలో గ్రేడింగ్ విధానం ఉండేదని, 2020 మార్చి నుంచి మార్కులు ప్రకటించే విధానాన్ని పున:ప్రారంభించామని తెలిపారు. విద్యార్థులకు అత్యధిక మార్కులు రావడానికి తమ విద్యాసంస్థలే కారణమని విద్యా సంస్థలు, ట్యుటోరియల్ ఇన్‌స్టిట్యూషన్స్ ప్రచారం చేసుకోవడానికి అనుమతి లేదన్నారు. అలాంటి ప్రచారం వల్ల విద్యార్థులపై విపరీతమైన ఒత్తిడి పడుతోందనీ, దాన్ని నివారించేందుకు ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందన్నారుఫలితాలను తమకనుకూలంగా ప్రచారం చేసుకోవడానికి ప్రభుత్వ పరీక్షల చట్టం 7ఏ ప్రకారం వీలు లేదన్నారు. ఎవరైనా ఉల్లంఘించి ప్రచారం చేసుకున్న, ప్రకటనలు విడుదల చేసినా లక్ష జరిమానా, ఏడేళ్ల వరకు జైలు శిక్ష అనుభవించాల్సి ఉంటుందని హెచ్చరించారు.

## ఎమ్మెల్యేల దాడులపై చర్చోపచర్చలు

రాజమండ్రి, జూన్ 3, పోలవరం ఇంజినీర్‌పై వైసీపీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా అందరి ముందు దాడి చేయడం ఉద్యోగవర్గాల్లో కలకలం రేపుతోంది. పోలవరం కాలువ అంచనాలు పెంచి బిల్లులు తయారు చేయాలని రాజా ఆదేశిస్తే.. ఆ ఇంజినీర్ తన వల్ల కాదన్నారు. అది నచ్చని రాజా? సమావేశంలోనే ఇతర ఉన్నతాధికారులు ఉండగానే దాడి చేశారు. మూడుసార్లు చెంపలు వాయించారు. మామూలుగా అయితే ప్రభుత్వ ఉద్యోగిపై దాడి చేయడం చిన్న విషయం కాదు . కానీ ఇక్కడ మాత్రం ఆ దాడికి గురయిన ఇంజినీర్‌కు ఉన్నతాధికారుల సపోర్ట్ కూడా లేదు. అయితే ఆ ఉద్యోగి మాత్రం తన్నులు తిన్నది తాను కాబట్టి .. వెళ్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. సోషల్ మీడియా పోస్టులకు తప్ప ఇలాంటి కేసులు చిన్న చిన్నవనుకునే పోలీసులు కేసు నమోదు చేయలేదు. ఉద్యోగి ? మనకెందుకు చెప్పు కష్టాలు? మూడు దెబ్బలేగా వదిలేస్తా పోలా అన్నట్లుగా మైండ్ సెట్ మార్చేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇందులో ఉద్యోగి పని చేస్తున్న జలవనరుల శాఖ ఉన్నతాధికారులు కూడా ఉన్నారు. ఇదంతా మంత్రి అంబటి రాంబాబు పర్యటన నేపథ్యంలో జరిగింది. అయితే ఎమ్మెల్యే రాజా ? ఇంజినీర్‌పై దాడి చేసినప్పుడు ఆయన మరో రూంలో విశ్రాంతి తీసుకుంటున్నారు. వైసీపీ నేతలు ఇతరుల్ని కొడతాం.. తిడతాం.. దాడి చేస్తామన్న హెచ్చరికలు ఇటీవలి కాలంలో ఎక్కువైపోయాయి. కొంత మంది నేరుగా యాక్షన్‌లోకి వచ్చేస్తున్నారు. ఎవరిని పడితే వారిని కొట్టడానికి వెనుకాడటం లేదు. చట్టం వైసీపీ నేతలకు వర్తించదని పోలీసులు ఇప్పటికే వెసులుబాటు ఇచ్చేశారేమో కానీ చంపుతామని బెదిరిస్తున్న వారికి కూడా కావాల్సినంత స్వేచ్ఛ ఉంది. అందుకే? అధికార పార్టీ ప్రజాప్రతినిధులు చెలరేగిపోతున్నారు.

## సుబ్బారాయుడి పై యాక్షన్ తో వార్నింగ్ బెల్స్...

విజయవాడ, జూన్ 3, నిజమే.. పార్టీ నియమనిబంధనలను ఉల్లంఘించిన వారిని ఎవరినీ ఉపేక్షించకూడదు. ఎవరు పార్టీ వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడినా ఉపేక్షించకూడదు. పార్టీ నాయకత్వం క్యాడర్ లో పలుచనగా మారుతుంది. కొత్తపల్లి సుబ్బరాయుడిపై వేటు వేయడం సరైన నిర్ణయమే. దానిని ఎవరూ కాదనలేరు. ఇష్టం లేకపోతే పార్టీ నుంచి వెళ్లిపోవాలి. అంతే తప్ప ప్రభుత్వ, పార్టీ నిర్ణయాలను తప్పు పడుతూ ఇబ్బందిగా మారితే పార్టీ నుంచి బయటకు పంపడమే మంచిది. ఇందులో ఎవరికీ మినహాయింపు ఉండకూడదు. అప్పుడే పార్టీ నాయకత్వంపై కిందిస్థాయిలో నమ్మకం ఏర్పడుతుందికానీ కొత్తపల్లి సుబ్బారాయుడిపై వేటు వేసినంత సులువుగా నరసాపురం ఎంపీ రఘురామ కృష్ణరాజుపై వేయకపోవడం ఇప్పుడు పార్టీలో చర్చనీయాంశమైంది. గత రెండేళ్ల నుంచి రఘురామ కృష్ణరాజు పార్టీని ఇబ్బంది పెడుతున్నారు. ప్రభుత్వ పథకాలను నేరుగానే విమర్శిస్తున్నారు. పార్టీకి వ్యతిరేకమైన మీడియాలో కూర్చుని వైసీపీ ప్రతినిధిగా ప్రభుత్వ వ్యవహారశైలిని, చివరకు నాయకుడి తీరును కూడా రఘురామ కృష్ణరాజు అనేక రోజులుగా విమర్శిస్తున్నారు. కానీ ఆయనపై పార్టీ పరంగా ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఆయనపై స్పీకర్ కు అనర్హత వేటు వేయాలని కోరడం మినహాయించి రాజుగారిని పూర్తిగా బయటకు వదిలేశారు. రఘురామ కృష్ణరాజు విషయంలో తీసుకోని చర్యలు కొత్తపల్లి సుబ్బారాయుడిపై ఎందుకు తీసుకున్నట్లు? ఆయనకు ఏ పదవి లేదనేగా? రాజుపై వేటు వేస్తే ఆయన వైసీపీ ప్రతినిధిగా చెప్పుకోరు. ఇప్పటికీ తాను వైసీపీ ఎంపీగానే ఆయన చెప్పుకుని తిరుగుతున్నారు. ఇది పార్టీకి, నాయకత్వానికి ఇబ్బంది కల్గించే అంశమే. వాస్తవానికి రఘురామ కృష్ణరాజు ఎంపీ పదవికి రాజీనామా చేస్తానని రెండు నెలల క్రితం చెప్పారు. డెడ్ లైన్ కూడా విధించారు. ఫిబ్రవరి 5వ తేదీ తర్వాత రాజీనామా చేస్తానన్న రాజుగారు ఇప్పటి వరకూ రాజీనామా చేయలేదు. ఎన్నికలు దగ్గరపడుతున్న సమయంలో.... అందుకు బీజేపీ నుంచి సానుకూలత రాకపోవడమే కారణమని చెబుతున్నా రఘురామ కృష్ణరాజును ఉపేక్షించడం పార్టీ పరంగా క్షేమం కాదు. ఇంకా ఎన్నికలకు రెండేళ్ల సమయం ఉంది. ఈ రెండేళ్లలో పార్టీలోనే ఉండి పార్టీ పరంగా జగన్ ను నేరుగా విమర్శిస్తారు. పార్టీ నిర్ణయాలను ఎండగడతారు. అది జనం ఎలా రిసీవ్ చేసుకున్నారన్నది పక్కన పెడితే.. క్యాడర్, నేతల్లో మాత్రం భయం అనేది ఉండదు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో పార్టీ నుంచి వెళ్లే వారు కూడా ఎలాంటి ఫియర్ లేకుండా వెళ్లిపోతారు. అందుకే రఘురామ కృష్ణరాజు వేటు వేయడమే మంచిదని పార్టీ సీనియర్ నేతలు కూడా అభిప్రాయపడుతున్నారు. మరి జగన్ నిర్ణయం ఎలా ఉంటుందో చూడాలి మరి?

## తిరుమల లడ్డూల పరిమితి

తిరుమల, జూన్ 3, తిరుమల తిరుపతి దేవస్థానం భక్తుల రద్దీకి తగినట్టుగా ఏర్పాట్లు చేయడంలో ఘోరంగా విఫలమైంది. భక్తులు తిరుమల రావద్దనీ, వారి ప్రయాణాలను వాయిదా వేసుకోవాలనీ కోరి తూచ్ అలా చెప్పలేదన్న టీటీడీ.. ఇప్పుడు తాజాగా శ్రీవారి లడ్డూలపై పరిమితి విధించింది. ఇంత కాలం భక్తులకు ఎన్ని కావాలంటే అన్ని లడ్డూలు విక్రయించిన టీటీడీ ఇప్పుడు వాటిని రెండుకు పరిమితం చేసింది. దర్శనం చేసుకున్న భక్తుడికి ఉచితంగా ఇచ్చే లడ్డూ కాకుండా కేవలం రెండు లడ్డూలను మాత్రమే విక్రయిస్తున్నారు. రోజుకు 3లక్షల లడ్లు మాత్రమే తయారౌతున్నాయనీ, అయితే రోజుకుభక్తుల సంఖ్య 90 వేలకు మించడంతో లడ్డూల విక్రయంపై పరిమితి విధించక తప్పలేదని టీటీడీ పేర్కొంది విక్రయ కేంద్రం అధికారులు కూడా భక్తులకు రెండు లడ్డూలు మాత్రమే విక్రయించినట్లు ధృవీకరించారు. ప్రస్తుత భక్తుల రద్దీ కొద్దిగా తగ్గుముఖం పట్టినందున శుక్రవారం నుంచి భక్తులకు ఉచితంగా ఇచ్చే లడ్డూ కాకుండా నాలుగు లడ్డూలు విక్రయించనున్నట్లు అధికారులు తెలిపారు.



# మాగంటి బాబు ప్రకటనతో టీడీపీ నేతల్లో కాక..

ఏలూరు, జూన్ 3,తెలుగుదేశం పార్టీలో కొత్తరక్తాన్ని నింపి వచ్చే ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా పనిచేస్తామని చంద్రబాబు, నారా లోకేష్‌లు మహానాడు వేదికగా చెప్పుకొచ్చారు. ఏలూరు పార్లమెంటు నియోజకవర్గానికి ఆ మాటలు ఎంతవరకు వర్తిస్తాయనేది ప్రస్తుతం తమ్ముళ్ల ప్రశ్న. వచ్చే ఎన్నికల్లో ఏలూరు ఎంపీ టికెట్ ఎవరికి ఇస్తారు? మాజీ ఎంపీ మాగంటి బాబు విషయంలో పార్టీ ఎలాంటి నిర్ణయం తీసుకుంటుంది అని చర్చ జరుగుతోంది. 2014 ఎన్నికల్లో అతికష్టం మీద టికెట్ సంపాదించి గెలిచారు మాగంటి బాబు. 2019 ఎన్నికల్లో ఓడిపోయారు. గత ఏడాది కుటుంబంలో వచ్చిన కుదుపులతో డీలా పడ్డారు మాగంటి బాబు. మరో రెండేళ్లలో ఎన్నికలు వస్తాయన్న తొందరో.. ఆలస్యం చేస్తే ఇంకెవరైనా కర్చీఫ్ వేస్తారనే ఆందోళనో ఏమో.. ప్రత్యక్ష రాజకీయాలపై కొద్దిరోజుల క్రితం ఆయన ద్వారకా తిరుమలలో కీలక ప్రకటన చేశారు. యాక్టివ్ పాలిటిక్స్‌లో కొనసాగుతానన్నది ఆ స్టేట్‌మెంట్ సారాంశం. అప్పటి నుంచి ఏలూరు పార్లమెంట్ పరిధిలోని టీడీపీ శిబిరాల్లో ఒక్కటే చర్చ. బాబుకు మళ్లీ ఎంపీ టికెట్ ఇస్తారా? ఇస్తే పరిస్థితి ఏంటి అని ఆరాలు తీసేవారు ఎక్కువయ్యారు.2019 ఎన్నికల్లోనే మాగంటి బాబుకు కాకుండా మరోనేతకు ఎంపీ టికెట్ ఇస్తారని ప్రచారం సాగింది. చివరి నిమిషంలో ఆయనే పోటీలో నిలిచి ఓడిపోయారు. 2014లో ఎంపీగా ఉన్నప్పుడు పార్లమెంటు పరిధిలోని టీడీపీ ఎమ్మెల్యేలతో ఆయనకి అస్సలు కుదిరేది కాదు. ఎమ్మెల్యేలతో అంటిముట్టనట్టు ఉండటమే కాకుండా.. ఆయా నియోజకవర్గాల్లో కిందిస్థాయి కేడర్‌లో వర్గవిభేదాలను పెంచి పోషించారనే ఆరోపణలు మాగంటి బాబుపై ఉన్నాయి. పోలవరం, చింతలపూడి, కైకలూరుల్లో మాగంటి బాబు తీరువల్ల పార్టీకి చాలా నష్టం జరిగిందన్నది అక్కడ టీడీపీ నేతలు చెప్పేమాట. అలాంటిది ప్రత్యక్ష రాజకీయాల్లో సత్తా చాటుతానని మాజీ ఎంపీ చెప్పడంతో లోకల్ తెలుగుదేశం నేతల్లో కాక రేపుతోందట.స్థానిక సంస్థల ఎన్నికల సమయంలో మాగంటి బాబు ఏమయ్యారు అని ప్రశ్నలు సంధిస్తున్నారు పార్టీ నేతలు. పైగా ఎలక్షన్స్ తర్వాత వైసీపీ నేతలతో చర్చలు జరపడం వెనక ఆంతర్యం ఏంటని నిలదీస్తున్నారట. ఇప్పటి వరకూ పార్టీకి దూరంగా ఉంటూ వచ్చిన మాజీ ఎంపీని ఇకపైనా దూరంగానే ఉంచడం మంచిదని అధిష్ఠానానికి సంకేతాలు పంపుతోందట కేడర్. వచ్చే ఎన్నికలను టీడీపీ కీలకంగా భావిస్తోంది. ఇలాంటి సమయంలో వర్గపోరును ప్రోత్సహించేవారిని అక్కున చేర్చుకున్నా.. ఎన్నికల్లో టికెట్ ఇచ్చినా

2019 ఫలితమే రిపీట్ అవుతుందని ముఖం మీదే చెప్పేస్తున్నారట. టీడీపీలోని ఇతర నాయకుల ఆత్మస్థైర్యం దెబ్బతినకుండా జాగ్రత్త పడాల్సింది అధిష్ఠానమేనని తేల్చేస్తున్నారట. ఇదే విషయాన్ని అధినేత దృష్టికి తీసుకెళ్లినట్టు సమాచారం. చంద్రబాబు నుంచి క్లారిటీ తీసుకునే రంగంలోకి దిగాలని ఏలూరు పార్లమెంట్ పరధిలోని టీడీపీ నేతలు మాగంటి బాబుకు చెప్పకనే చెప్పేశారని చెవులు కొరుక్కుంటున్నారు.ఇదే సమయంలో మాగంటి బాబు విషయంలో మరో చర్చ జరుగుతోంది. ఆయనకు ఈ దఫా ఎంపీ టికెట్ కాకుండా.. ఏలూరు పార్లమెంట్ పరిధిలోనే ఏదో ఒక అసెంబ్లీ సెగ్మెంట్‌కు టికెట్ ఇస్తారని ప్రచారం జరుగుతోంది. అయితే కొత్తరక్తంతో పార్టీని పరుగులు పెట్టిస్తామని చంద్రబాబు చెప్పడంతో మాగంటి బాబు విషయంలో ఎలాంటి నిర్ణయం తీసుకుంటారన్నది ఒక ప్రశ్న. మరి.. మాగంటి బాబు రానున్న రోజుల్లో ఏం చేస్తారో చూడాలి.

## అనంత బాబు కేసులో నోరు విప్పని టీడీపీ

రాజమండ్రి, జూన్ 3, గత నెల 19న ఎమ్మెల్సీ అనంతబాబు మాజీ డ్రైవర్ సుబ్రమణ్యం హత్య జరిగింది. 23న పోలీసులు అనంతబాబును అదుపులోకి తీసుకున్నారు. అయితే మధ్యలో నాలుగు రోజులు ఆ సమస్యను హైలైట్ చేయడానికి టీడీపీ అన్ని ప్రయత్నాలు చేసింది. రాష్ట్ర స్థాయిలో టీడీపీ నిజనిర్ధారణ కమిటీ వేసింది కూడా. ఇక్కడ వరకు బాగానే ఉంది. కానీ ఆ ఘటనపై టీడీపీకే చెందిన జ్యోతుల నెహ్రూ, వరుపుల రాజా ఎక్కడా పెదవి విప్పింది లేదు. అనంతబాబుకు జ్యోతుల నెహ్రూ, వరుపుల రాజా కుటుంబాలకు బంధుత్వం ఉంది. ఆ కారణంగానే వారు సైలెంట్ మోడ్‌లోకి వెళ్లినట్టు టాక్ఎన్నికల్లో జగ్గంపేట నుంచి టీడీపీ తరపున జ్యోతుల నెహ్రూ, ప్రత్తిపాడు నుంచి వరుపుల రాజా పోటీ చేసి ఓడిపోయారు. ప్రస్తుతం ఆ నియోజకవర్గాలకు వారే పార్టీ ఇంఛార్జులు. ఘటన జరిగినప్పుడు వాళ్లిద్దరూ మాట్లాడితే బాగుంటుందని టీడీపీ నాయకులు వారి దృష్టికి తీసుకెళ్లారట. ఎమ్మెల్సీ అనంతబాబు గురించి తాము ఎన్ని మాట్లాడినా పొలిటికల్ విమర్శలుగానే ఉంటాయని.. మీరు మాట్లాడితే మరింత మైలేజ్ వస్తుందని చెప్పారట. దానికి కూడా వాళ్ల నుంచి ఎటువంటి రెస్పాన్స్ లేదట. విషయం వెలుగులోకి వచ్చిన కొద్దిగంటల్లోనే మాజీ హోంమంత్రి చినరాజప్ప వెళ్లి డ్రైవర్ సుబ్రమణ్యం కుటుంబాన్ని పరామర్శించారు. అప్పుడు కూడా నెహ్రూను వెంట తీసుకెళ్దామని ప్రయత్నించినా అటునుంచి సౌండ్ లేదట.జ్యోతుల నెహ్రూ కుమారుడు జ్యోతుల నవీన్ టీడీపీ జిల్లా అధ్యక్షుడిగా ఉన్నారు. నవీన్ సీన్‌లోకి వచ్చినా పెద్దగా ఇన్వాల్వ్ కాలేదట. వచ్చామా వెళ్లామా అన్నట్టు వ్యవహారాన్ని డీల్ చేశారట. మహానాడు ముగిసిన తర్వాత జ్యోతుల నెహ్రూ పార్టీ కార్యాలయంలో ప్రెస్‌మీట్ పెడదామని అనుకున్నారట. ఆ విషయాన్ని పార్టీలో సీనియర్లు దృష్టికి తీసుకుని వెళ్లినట్టు చెబుతున్నారు. అయితే అటు నుంచి ఎవరూ స్పందించలేదట. అనంతబాబు వ్యవహారంలో లేని శ్రద్ధ ఇప్పుడెందుకని నెహ్రూ, రాజాలపై సెటైర్లు వేసినట్టు తెలుస్తోంది. టీడీపీకి ప్లస్ అయితేనే అందరికీ ఉపయోగం అని అంటున్నారట తెలుగు తమ్ముళ్లుగతంలో జ్యోతుల నెహ్రూ వైసీపీలో ఉన్నారు. శాసనసభపక్ష ఉపనేతగా కూడా పనిచేశారు. దీంతో ఆయనకు పాత పార్టీ వాసనలు, చుట్టరికాలు అడ్డు వచ్చాయో ఏమో అని శ్రేణులు చెవులు కొరుక్కుంటున్నారట. మహానాడు తర్వాత వీరిపై పార్టీలోని మిగతా నేతల స్వరం కూడా పెరుగుతున్నట్టు టాక్. బంధాలు.. బంధుత్వాలు ఏమైనా ఉంటే గడప లోపల తేల్చుకోవాలని.. పార్టీ వరకు బయటకొచ్చి మాట్లాడితే మరోలా ఉండేదని అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయట. పార్టీ లైన్‌లోనే వెళ్తే బాగుండేదని.. సొంత పెత్తనం వల్ల అందరికీ నష్టమేనని సన్నాయి నొక్కులు నొక్కుతున్నారట. అయితే రాజకీయాల కోసం బంధుత్వాలను వదిలేయాలా అనేది జ్యోతుల నెహ్రూ వర్గం వాదనగా ఉందట. మొత్తానికి ఎమ్మెల్సీ అనంతబాబు ఎపిసోడ్ జిల్లా టీడీపీలో విభేదాలకు బీజం వేసింది. ఈ విషయంలో ఎవరి వాదన వారిదే. మరి సమస్యకు అధినేత ఏ విధంగా ఫుల్‌స్టాప్ పెడతారో చూడాలి.

## హైదరాబాద్ కు వస్తున్న బస్సులో మంటలు..

### ఏడుగురు దుర్మరణం!

గుల్బర్గా కర్ణాటక కలబురగిలో ఘోర రోడ్డుప్రమాదం జరిగింది. ఓ లారీని ఢీకొట్టి బస్సు బోల్తాపడగా మంటలు చెలరేగాయి. ఈ ఘటనలో ఇప్పటివరకు ఏడుగురు మరణించినట్లు సమాచారం. బస్సులో డ్రైవర్తో పాటు మరో 35 మంది ప్రయాణికులు ఉన్నారు. 12 మందిని రక్షించి ఆస్పత్రికి తరలించారు. బీదర్–శ్రీరంగపట్టణం హైవేపై కమలాపుర వద్ద శుక్రవారం ఉదయం 6 గంటల ప్రాంతంలో దుర్ఘటన చోటుచేసుకుంది. బస్సు గోవా నుంచి హైదరాబాద్ వస్తున్నట్లు తెలుస్తోంది. మృతులంతా హైదరాబాద్కు చెందినవారేనని సమాచారం. బస్సును గోవాలోని ఆరెంజ్ కంపెనీకి చెందినదిగా గుర్తించారు.

## మునిసిపల్ కార్యాలయం ముందు విపక్షాల నిరసన

కొవ్వూరు మున్సిపల్ హైస్కూల్ ను విద్యా శాఖలో విలీనం చేయడానికి వీలు లేదని టిడిపి, జనసేన. బీజేపీ పార్టీలు నాయకులు కొవ్వూరు మున్సిపల్ ఆఫీస్ ఎదుట నిరసనకు దిగారు. మునిసిపల్ హైస్కూల్ ను విద్యా శాఖలో విలీనం చేయడానికి వీల్లేదని ప్రతిపక్ష పార్టీలు వాదించాయి. దాంతో మున్సిపల్ కౌన్సిల్ సమావేశం రెండుసార్లు వాయిదా పడింది. శుక్రవారం ఉదయం కొవ్వూరు మున్సిపాలిటీ అత్యవసర సమావేశం ఏర్పాటు చేసింది. ఈ నేపథ్యంలో ప్రతిపక్షాల నిరసనలతో కొవ్వూరు పట్టణ మున్సిపల్ ఆఫీస్ వద్ద ఉద్రిక్తత నెలకొంది. పోలీసులు భారీగా బందోబస్తు ఏర్పాటు చేసారు.

## బిచ్చగాడి మూటలో నగదు కట్టలు

కాకినాడ కాకినాడ జిల్లా కాకినాడ రూరల్ కరప మండలం వేలంగి గ్రామం లో గురువారం రాత్రి ఓ బిచ్చగాడు చనిపోయాడు. అతని వద్ద మూడు మూటలు ఉన్నాయి. వాటిని తెరిచి చూస్తే నోట్ల కట్టలు ఉన్నాయి. రాత్రి లెక్కింపు పూర్తి కాలేదు. దీంతో ఆ మూటలకు మధ్యవర్తుల సమక్షంలో సీల్ వేసి పోలీస్ స్టేషన్ కు తరలించారు. అయితే ఆ వ్యక్తి బిక్షగాడు కాదు. హిందూ ధర్మాన్ని ప్రచారం చేసే సాధుపుంగవుడు. ఎక్కడినుండి వచ్చాడో తెలియదు. ఎవరూ లేని జీవి. హిందూ ధర్మం గురించి ప్రచారం చేసే వారు. చిన్న పిల్లలకు బాలారిష్టాలు తొలగేందుకు రక్షరేకులు కట్టేవాడు.

# సివిల్స్ ఫలితాల్లో ర్యాంకులు సాధించిన అభ్యర్థులకు అభినందనలు

### రాయలసీమ సాగునీటి సాధన సమితి

నంద్యాల సివిల్స్ ఫలితాల్లో ఉమ్మడి కర్నూలు జిల్లాకు చెందిన నలుగురు విద్యార్థులు ర్యాంకులు సాధించడం మన ఉమ్మడు కర్నూలు జిల్లాకే గర్వకారణమని రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షులు బొజ్జా దశరథరామిరెడ్డి హర్షం వెలిబుచ్చారు. శుక్రవారం నంద్యాల రాయలసీమ సాగునీటి సాధన సమితి కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో దశరథరామిరెడ్డి మాట్లాడుతూ. సివిల్స్ పరీక్షలో మన కర్నూలు జిల్లాకు చెందిన మహానంది మండలం నందిపల్లె గ్రామానికి చెందిన మనీషారెడ్డి, చాగలమర్రి మండలానికి చెందిన యశ్వంత్ కుమార్ రెడ్డి, కోవెలకుంట్ల కు చెందిన సుధీర్ కుమార్ రెడ్డి, ఎమ్మిగనూరు పట్టణానికి చెందిన ,అంబికాజైన్ లు సివిల్స్ లో ర్యాంకులు సాధించడం వీరంతా మన కర్నూలు జిల్లా వాసులు కావడం ఎంతో ఆనందాన్ని కలిగిస్తోందని ఆయన అన్నారు.పిల్లల ఆలోచనలకు విలువనిచ్చి వారి ఆలోచనలకు అనుగుణంగా వారికి పూర్తి సహకారం, ప్రోత్సాహం అందిస్తే విద్యార్థులు ఏదైనా సాధిస్తారన్న విషయాన్ని ఈ నలుగురు నిరూపించారని ర్యాంకులు సాధించిన విద్యార్థులకు, వారి కుటుంబ సభ్యులకు ప్రత్యేక అభినందనలు తెలుపుతున్నామని ఆయన అన్నారు.విద్యార్థులు తమలో వున్న ఆత్మన్యూనత, బలహీనతలను తొలగించుకుని మానసిక స్థైర్యంతో పట్టుదల, సహనం, ఏకాగ్రతతో చదివాలని ఒక్కోసారి మన ప్రయత్నాలలో విఫలమైనా నిరుత్సాహపడకుండా పట్టుదలతో, ఓర్పుతో విజయానికి సిద్దం కావాలని దశరథరామిరెడ్డి విద్యార్థులకు సూచించారు.విద్యార్థుల అభిరుచికి తగ్గట్టుగా కుటుంబ సభ్యులు ప్రోత్సాహాన్ని తమ పిల్లలకు అందించాలని అప్పుడే పిల్లలు తమ కలలను సాకారం చేసుకుంటారని ఆయన పేర్కొన్నారు.సివిల్స్ కు ఎంపికయిన వీరు ప్రజలకు నాణ్యమైన సేవలను సత్వరమే అందేటట్లుగా సేవ చేయాలని ఆయన సూచించారు. సమాజం మెచ్చుకునేటట్లుగా, కుటుంబ సభ్యుల గౌరవాన్ని పెంచేటట్లుగా వారు పనితీరును మెరుగుపరిచేందుకు కృషి చేసుకోవాలని ఆయన కోరారు.సివిల్స్ కు ఎంపికకై తాము చేసిన కృషిని, అనుభవాలను తోటి విద్యార్థులకు మార్గదర్శకం చేయాలని మిగతా విద్యార్థులు కూడా వీరిని ఆదర్శంగా తీసుకుని ఉత్తమ ఫలితాలను సాధించుకోగలరని దశరథరామిరెడ్డి అభిప్రాయపడ్డారు.

# సైకిల్ తొక్కడం ఆరోగ్యకరం...2 టౌన్ సీఐ సుబ్బారావు

నెల్లూరు సైకిలు తొక్కడం ఆరోగ్యకరమని నెల్లూరు రెండవ నగరం పోలీస్ స్టేషన్ సర్కిల్ ఇన్స్పెక్టర్ సుబ్బారావు పేర్కొన్నారు. శ్రీరామరాజు చారిటబుల్ ట్రస్ట్ మరియు పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో “ప్రపంచ సైకిల్ దినోత్సవం” కార్యక్రమాన్ని శుక్రవారం చేపట్టారు. ఈ సందర్భంగా నెల్లూరు నగర పరిధిలోని జాకీర్ హుస్సేన్ నగర్ ,నేతానగర్ లోని ఎస్.వి.ఆర్.స్కూల్ నుండి సత్యనారాయణ పురం వరకు సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిగా విచ్చేసిన నవాబుపేట సర్కిల్ ఇన్స్పెక్టర్ టి.వి. సుబ్బారావు, దిశా మహిళా స్టేషన్ సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎన్.రామారావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఒకప్పుడు అందరికీ అందుబాటులో ఉన్న వాహనం సైకిల్ మాత్రమేనని అన్నారు . కాలానుగుణంగా ప్రస్తుతం బైక్, కారు వచ్చిన తరువాత వీటి వాడకకం తక్కువైపోయిందని తెలిపారు. సైకిల్ వాడకం వల్ల ఆరోగ్యంతోపాటు పొల్యూషన్ ను కూడా తగ్గించవచ్చునన్నారు. అందువల్ల ప్రతి ఇంటిలో కనీసం ఒక్క సైకిల్ అయినా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు కె. మురళీ మోహన్ రాజు, ఎస్.వి.ఆర్.స్కూల్ కరెస్పాండంట్ అందే శ్రీనివాసులు, ప్రిన్సిపాల్ బి.రమేష్ బాబు, రోటరీ క్లబ్ మాజీ అధ్యక్షుడు వై.చంద్ర శేఖర్ రెడ్డి, విశ్రాంత లేబర్ కమిషనర్ రాచపాలెం రఘు, అరవ రాయప్ప, జయ వెంకటేష్, కె.పవన్, కె. ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌లో రాజకీయం రసవత్తరం

హైదరాబాద్, జూన్ 3, ఆలేరు నియోజకవర్గ కాంగ్రెస్‌లో రాజకీయం రసవత్తరంగా మారుతోంది. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ టికెట్‌పై పోటీ చేయడానికి చాలామంది నేతలు సిద్ధం అవుతున్నారు. ఇప్పటికే రేస్‌లో నలుగురు ఉండగా.. తాజాగా బీజేపీ నుంచి కాంగ్రెస్‌లో చేరిన బంట్రు శోభారాణి సైతం పోటీలోకి వచ్చారు. ఈ ఐదుగురూ తమ బలాన్ని పెంచుకోవాలని.. అస్త్రశస్త్రాలకు పదును పెడుతున్నారట. దీంతో ఎన్నికల నాటికి ఆలేరు కాంగ్రెస్ రాజకీయం ఎలా ఉంటుందో అనే ఉత్కంఠ.. ఆందోళన కేడర్‌లో కనిపిస్తోంది.మాజీ ఎమ్మెల్యే కుడుదల నగేష్, పార్టీ నేతలు బీర్ల ఐలయ్య, బోరెడ్డి



అయోధ్యరెడ్డి, కల్లూరి రామచంద్రారెడ్డిలు పోటీపై ధీమగా ఉన్నారు. గతంలో టీఆర్ఎస్ ఎమ్మెల్యేగా గెలిచిన కుడుదుల నగేష్.. ప్రస్తుతం ఆలేరు జడ్పీటీసీగా ఉన్నారు. నియోజకవర్గంలో ఉద్యమనేతగా అందరికీ పరిచయం ఉన్న నగేష్.. టీఆర్ఎస్‌తో విభేదించి కాంగ్రెస్‌లో చేరారు. అయితే ఎంపీ కోమటిరెడ్డి వెంకటరెడ్డితో ఆయనకు పడటం లేదు. కానీ.. కాంగ్రెస్ పెద్దలతో మంచి సంబంధాలే ఉన్నాయి. గతంలో ఎమ్మెల్యేగా పనిచేయడంతో.. ఈసారి టికెట్ ఆశించే వారిలో మొదటి వరసలో ఉన్నారు నగేష్‌కోమటిరెడ్డి వెంకటరెడ్డి అనుచరుడిగా ముద్ర పడ్డ ఐలయ్య సైతం తనదే కాంగ్రెస్ టికెట్ అంటున్నారట. ఆలేరులో కురుమ సామాజికవర్గం ఓటర్లు ఎక్కువ. ఐలయ్య అదే సామాజికవర్గం. పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డికి ఈ మధ్య కాలంలో చేరువయ్యారు. మాజీ జడ్పీటీసీ అయోధ్యరెడ్డి సైతం టికెట్‌పై ధీమాగా ఉన్నారు. రేవంత్ కోర్ టీమ్‌లో ఉండటంతో పెద్ద ఆశలే పెట్టుకున్నారట. వచ్చే ఎన్నికలకు గ్రౌండ్ వర్క్ కూడా చేసుకుంటున్నట్టు టాక్. గతంలో బీఎస్పీ, ఆప్ పార్టీల నుంచి ఆలేరులో పోటీ చేసి ఓడిన కల్లూరి రామచంద్రారెడ్డి సైతం కాంగ్రెస్‌లోనే ఉన్నారు. కల్లూరి కూడా కాంగ్రెస్ టికెట్‌పై పోటీ చేయడానికి ఉవ్విళ్లూరుతున్నారట. అయితే గతంలో బొమ్మలరామారం నుంచి జడ్పీటీసీగా పోటీ చేసి ఓడిపోయారు. ఈ ముగ్గురూ భారీగానే ఆశలు పెట్టుకున్నారట. బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలిగా ఉన్న బంట్రు శోభారాణి.. కమలానికి గుడ్‌బై చెప్పి కాంగ్రెస్ కండువా కప్పేసుకున్నారు. ఆమెది కూడా ఆలేరే. అమెరికా పర్యటనలో ఉన్న రేవంత్‌రెడ్డి సమక్షంలో శోభారాణి కాంగ్రెస్ పార్టీలో చేరారు. మహిళా కోటాలో టికెట్ ఆమెకే ఇస్తారని శోభారాణి వర్గం భావిస్తోందట. అయితే శోభారాణి చేరికపై సమాచారం ఇవ్వలేదని కోమటిరెడ్డి వెంకటరెడ్డి వర్గం అసంతృప్తితో ఉందట. ఆమె 2009లోనే ఆలేరులో ప్రజారాజ్యం నుంచి పోటీ చేసి ఓడిపోయారు. తర్వాత టీడీపీలో చేరారు. 2018లో ఆలేరు టికెట్ ఆశించినా దక్కలేదు. ఆపై బీజేపీలో చేరారు. ఇప్పుడు కాంగ్రెస్ గూటికి వచ్చారు. అయితే అమెరికాలో పార్టీ కండువా కప్పుకొన్న శోభారాణికి పీసీసీ చీఫ్ రేవంత్ ఇచ్చిన హామీ ఏంటన్నది ప్రశ్నగా ఉంది. మొత్తానికి ఆలేరు కాంగ్రెస్‌లో నేతల సంఖ్య పెరిగే కొద్దీ టికెట్ ఆశించేవారు కూడా పెరిగిపోతున్నారు. మరి.. ఈ రేస్ హస్తానికి మేలు చేస్తుందో.. ప్రతికూలంగా మారుతుందో కాలమే చెప్పాలి

# 3,4,5 తరగతుల విలీనం ను ఆపాలి

### సి. పీ.ఎస్ ను రద్దు చేయాలి

కడప కడపలో 3,4,5 తరగతుల విలీ నంను ఆపాలని,సి.పి. ఎస్ ను రద్దు చేయాలని యు.టి.ఎఫ్ సహా ధ్యక్ష దు కె.సురేష్ కుమార్, రాష్ట్ర కార్యదర్సి లక్ష్మీ రాజా డిమాండ్ చేశారు. స్థానిక యుటియఫ్ భవన్ లో జరిగిన జిల్లా కౌన్సిల్ సమావేశం లో వారు ప్ర సంగించారు.చిన్న పిల్లల కు పాఠశాల అందుబా టులో వుండాలని,ఎక్క డో ఊరు బయట,మూ డు కిలోమీటర్లు దూరం లో ఉంటే ఆ పిల్ల వాడు పోగలడా.... అని వారు ప్రశ్నించారు.చేతనైతే చదువుకో,లేకపోతే నీ ఇష్టం అని పిల్ల వాన్ని, తల్లిదండ్రులను అగాథం లోకి నెట్టి,బాధ్యత నుం చి ప్రభుత్వం తప్పుకుం టున్నట్టు గా వ్యవహరిం చటం సరైనది కాదని వారు అన్నారు. ఎన్ ఈ పి అమలు పేద ప్రజల పాలిట శాపంగా మారబోతుంది అని తెలిపారు. నూతన జాతీయ విద్యా విధానం అమలు ఉపసంహరించుకునే వరకు ఉద్యోగ ఉపాధ్యాయ కార్మిక సంఘాలతో తల్లిదండ్రులను కలుపుకొని ఉద్యమాలు ఉధృతం చేస్తామని తెలిపారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే జాతీయ నూతన విద్యా విధానం అమలు ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తున్నాం. ముఖ్యమంత్రి తన పాదయాత్ర సమయంలో సిపిఎస్ వారం రోజుల లోపల రద్దు చేస్తామని సంకల్ప యాత్రలో అడుగడుగునా ప్రకటించారు. ఇప్పుడు ముఖ్యమంత్రి సిపిఎస్ రద్దు పై తనకు ఏమీ తెలియనట్టు తాను ఏమీ చెప్ప నట్టు వ్యవ హరించడందారుణం. సిపిఎస్ రద్దు చేస్తానని ఎన్నికలకు ముందు హా మీ ఇవ్వడం,అధికారం లోకి వచ్చాక జీ.పీ.ఎస్ ప్రతిపాదన ముందుకు తీసుకు రావటం అంటే ముఖ్యమంత్రి మాట తప్పాడు మడమ తిప్పాడని స్పష్టం అవుతుంది. అయితే ఉద్యోగ ఉపాధ్యాయ సంఘాలు సి పి ఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేసే వరకు ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. విద్యారంగాన్ని ముఖ్యమంత్రి, రాష్ట్రప్రభుత్వం ఒక ప్రయోగశాలగా మార్చటం అన్యాయం. విద్యా రంగంలో ఏదైనా మార్పు తీసుకునే ముందు ఉపాధ్యాయ సంఘాలతో , ఎమ్మెల్సీలతో చర్చించి నిర్ణయాలు చేయాలి తప్ప ప్రభుత్వ ఏకపక్ష నిర్ణయాలు తీసుకోవడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం. భవిష్యత్తులో రాష్ట్ర ప్రభుత్వం ఇలాంటి ఏకపక్ష ధోరణి విడనాడాలి ఏకపక్ష ధోరణి విడనాడే వరకు ఉద్యమాలు ఉధృతం చేస్తామని తెలిపారు. అలాగే ఉన్నట్టు ఉండి రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ కార్పొరేషన్ పాఠశాలల్లో విద్యా శాఖలో విలీనం చేయాలనుకోవడం ఏకపక్ష ధోరణి కి నిదర్శనం అన్నారు. విద్యాశాఖలో మున్సిపల్ కార్పొరేషన్ పాఠశాలలను ఎందుకు విలీనం చేయాలనుకుంటున్నరో చెప్పాలని డిమాండ్ చేశారు. విలీనం చేయటంవల్ల మున్సిపల్ కార్పొరేషన్ పాఠశాలకు కొత్తగా ఒరిగేది ఏమీ లేదని తెలిపారు. పై సమస్యల పరిష్కారం కోసం భవి ష్యత్తులో మరిన్ని పోరా టాలు చేస్తామని వారు తెలిపారు.జిల్లా కన్వీనర్ ఓబుల్ రెడ్డి మాట్లాడుతూ పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించడం తప్ప వేరే ఎటువంటి పెన్షన్ విధానాలను ఒప్పుకునేది లేదని చెప్పారు.ఈ కార్యక్రమంలో జిల్లా సహాధ్యక్షులు వై రవికుమార్ రూతు ఆరోగ్య మేరీ రాష్ట్ర కౌన్సిలర్లు సుజాత రాణి విజయ్ కుమార్ జిల్లా ట్రెజరర్ మహేష్ బాబు జిల్లా కార్యదర్శులు నాగార్జున్ రెడ్డి,దావుద్దీన్, నాగేశ్వరరావు, రవీంద్రుడు, చెరుకూరి శ్రీనివాసులు, చంద్రశేఖర్, నరసింహారావు, జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షులు రాజశేఖర్ రాహుల్ వివిధ మండలాల నాయకులు హాజరయ్యారు.

# బ్రాండిక్స్ ఎస్‌ఈజెడ్‌లో అమ్మోనియా లీక్.

విశాఖపట్టణం, జూన్ 3, అనకాపల్లి జిల్లాలో మరో దారుణం జరిగింది. అచ్యుతాపురంలో అమ్మోనియా లీక్ అయ్యింది. సీడ్స్ యూనిట్‌లో ఒక్కసారిగా ఘాటైన వాయువు లీకైంది. దీంతో వాంతులు, తల తిరుగుడుతో తీవ్రంగా ఉద్యోగులు ఇబ్బందిపడ్డారు. వెంటనే బాధితులను యాజమాన్యం హుటాహుటిన సెజ్‌లోని ఆస్పత్రికి తరలించారు. నలుగురు మహిళలకు బ్రాండిక్స్ ఎస్‌ఈజెడ్‌లో ఉన్న ఆరోగ్య కేంద్రంలో చికిత్స అందజేస్తున్నారు. బ్రాండిక్స్ ఎస్‌ఈజెడ్‌లో అమ్మోనియా లీకైంది. ఇందులో క్వాంటమ్ కంపెనీలోని మహిళా కార్మికులకు అస్వస్థతకు గురయ్యారు. ఈ ఘటనలో నలుగురు మహిళలకు ఎస్‌ఈజెడ్ ఆస్పత్రిలో చికిత్స కోసం తరలించారు. పోరస్ కంపెనీ నుంచి అమ్మోనియా లీకైందని అధికారులు నిర్ధారణ చేశారు.

## నకిలీ బ్యాండ్ పై అందోళన

గన్నవరం సహకార సంఘం సిబ్బందిని వెంటనే అరెస్ట్ చెయ్యాలని బ్యాంక్ ఎదురుగా బాధితులతో కాంగ్రెస్ నాయకురాలు సుంకర పద్మ శ్రీ ఆందోళన చేసారు. దొంగ బాండ్స్ ఇచ్చి పేదల సొమ్ము కోట్లు కొల్లొకొట్టిన బ్యాంక్ అధికారులను వెంటనే అరెస్ట్ చేసి పేదలకు న్యాయం చేయాలని నినాదాలు చేసారు. బ్యాంక్ ఎదురుగా టేంట్ వేసి ధర్నా చేసారు.సుంకర పద్మ శ్రీ మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే వంశీ దీనికి బాధ్యత వహించాలి. ఎం.ఎల్.ఏ తనకి అనుగుణంగా వున్న వ్యక్తి లని బ్యాంక్ ప్రెసిడెంట్ గా ఏర్పాటు చేసి పెదలను మోసం చేశారని పద్మ శ్రీ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటివరకు కేస్ నమోదు చెయ్య కుండా ఎందుకు వున్నారు పోలీసులు. నకిలీ బాండ్స్ ఇచ్చి పేదల సొమ్ము దోచుకుని , బ్యాంక్ సిబ్బంది పేదలు తీసుకు వచ్చిన బాండ్స్ మోహాన్ని కొడుతున్నారు ఇది అవమానం . కూలీ, పనులు చేసుకొని దాచుకున్న డబ్బులు దోచుకున్న వారిని వెంటనే అరెస్ట్ చెయ్యాలి అని డిమాండ్ చేశారు.

## ప్లాస్టిక్ కు వ్యతిరేకంగా ప్రచారం

విశాఖపట్నం విశాఖను ప్లాస్టిక్ రహిత సిటీగా తీర్చిదిద్దేం దుకు జిల్లా అధికారులు కసరత్తు ముమ్మరం చేశారు. ముందుగా విస్తృత స్థాయి ప్రచారంతో ప్రజల్లో అవగా హన వచ్చే విధంగా చర్యలను వేగవంతం చేశారు. నేరుగా జిల్లా కలెక్టర్ మల్లిఖార్జున్,జీవీఎంసీ కమిషనర్ లక్ష్మీశతో కలసి ప్లాస్టిక్ వాడకానికి వ్యతిరేకంగా ప్రచారా న్ని నిర్వహించారు.గత కొద్ది రోజులుగా రద్దీగా ఉండే ప్రాంతాల్లో పర్యటిస్తున్న అధికారులు ప్లాస్టిక్ కు బదులు గుడ్డ సంచులను వినియోగించి పర్యావరణ పరిరక్షణకు కృషి చెయ్యాలని విజ్ఞప్తి చేస్తున్నారు.ప్రజలకు అవగా హన కల్పించడంలో బాగంగా పలు ప్రాంతాల్లో పర్యటిం చి ప్రజలకు ప్లాస్టిక్ వాడకంతో వచ్చే ఇబ్బందులు,స మస్యలను వివరించారు.ప్రజలు ప్లాస్టిక్ కు బదులు ప్రత్యమ్నాయాల వినియోగంపై ప్రత్యేక దృష్టి సారిం చాలని సూచిస్తున్నారు.

### ఆగస్టు 7న కళ్యాణమస్తు ద్వారా టీటీడీ ఉచిత సామూహిక వివాహాలు

తిరుమల జూన్ 3 ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని జిల్లా కేంద్రాల్లో ఆగస్టు 7న కళ్యాణమస్తు ద్వారా ఉచిత సామూహిక వివాహాలు నిర్వహించేందుకు టీటీడీ ఏర్పాట్లు చేస్తుంది. ఏపీ సీఎం వైఎస్ జగన్ ఆదేశాల మేరకు కళ్యాణమస్తును పునః ప్రారంభిస్తున్నట్లు టీటీడీ చైర్మన్ వైవి సుబ్బారెడ్డి తెలిపారు. పేద కుటుంబాల్లో తమ పిల్లల వివాహాలు ఆర్థికంగా భారమై వారు ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతో శ్రీ వేంకటేశ్వర స్వామి ఆశీస్సులతో ఉచితంగా వివాహాలు జరిపించనున్నామని చెప్పారు.ఆగస్టు 7వ తేదీ చాంద్రమాన శుభకృత్ నామ సంవత్సరం శ్రావణ శుక్ల దశమి ఉదయం 8.07 గంటల నుంచి 8.17 గంటల మధ్య అనూరాధ నక్షత్రం సింహ లగ్నంలో వివాహాలు జరిపించాలని పండితులు సుముహూర్తం నిర్ణయించారని చైర్మన్ తెలిపారు.

## అత్తను కడతేర్చిన అల్లుడు

వీరులపాడు ఎన్టీఆర్ జిల్లా వీరులపాడు మండలం జయంతి గ్రామంలో ఘోర సంఘటన చోటు చేసుకుంది మృతురాలి భర్త తెలిపిన సమాచారం ప్రకారం తమ కుమార్తెను జయంతి గ్రామానికి చెందిన మారపాక దావీదు అనే వ్యక్తికి ఇచ్చి వివాహం చేశామని గత కొంత కాలంగా భార్యాభర్తల మధ్య మనస్పర్థలు తో గొడవలు జరుగుతుండడంతో పెద్దమనుషుల సమక్షంలో సర్ది చెప్పడం జరిగిందని గత రాత్రి తమ కుమార్తె ఫోన్ చేయడంతో జయంతి గ్రామానికి వచ్చిన అత్తతో గొడవకు దిగిన దావీదు తీవ్ర వాగ్వాదం చోటు చేసుకున్న ఈ క్రమంలో బలమైన ఇనుప రాడ్ తో అత్త శివమమ్మను కొట్టడంతో కిందపడిపోయిన ఆమెను రక్షించేందుకు మనమడు, కూతురు అడ్డుగా వచ్చిన వారిని కూడా చంపుతానని బెదిరించి ఆమెపై రాక్షసంగా దాడి చేసి చంపినట్లు మృతురాలి భర్త తెలిపాడు.. ఈ సంఘటన పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సోమేశ్వరరావు మీడియాకు తెలిపారు..

## ప్రియాంకా గాంధీకి కరోనా వైరస్

న్యూఢిల్లీ జూన్ 3 గురువారం కాంగ్రెస్ పార్టీ పార్టీ తాత్కాలిక అధ్యక్షురాలు సోనియా గాంధీకి కరోనా పాజిటివ్ రాగా, నేడు ఆమె కూతురు, పార్టీ ప్రధాన కార్యదర్శి ప్రియాంకా గాంధీ వాద్రాకు కరోనా వైరస్ సోకింది. దీంతో ఆమె స్వీయ నిర్బంధంలో ఉన్నారు. ‘నాకు కరోనా పాజిటివ్ వచ్చింది. స్వల్ప లక్షణాలు ఉన్నాయి. కరోనా నిబంధనలు పాటిస్తున్నాను. ప్రస్తుతం క్వారంటైన్‌లో ఉన్నాను. గత కొన్నిరోజులుగా తనను కలిసిన వారు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరుతున్నాను’ అని ట్వీట్ చేశారు. కాంగ్రెస్ పార్టీ అగ్ర నాయకత్వంలో ఒక్కొక్కరుగా కరోనా బారినపడుతున్నారు.



# తండ్రి కలెక్టర్ ... తనయుడు అంగన్వాడీ లో



కర్నూలు , జూన్ 03 -: కూలి నాలి చేసే తల్లిదండ్రులు సైతం తమ పిల్లలు ఉన్నత చదువులు చదవాలన్న ఆకాంక్షతో..లక్షలు పెట్టి కార్పొరేట్

**అంగన్వాడీ లో కుమారుణ్ణి చేర్పించిన కర్నూలు జిల్లా కలెక్టర్ పి కోటేశ్వర రావు**

పాఠశాలల్లో చదివించాలని ఆశ పడుతున్న ఈ రోజుల్లో , అన్నీ ఉండి సామాన్యుడి తరహాలో అంగన్వాడి పాఠశాలలో తన కుమారుడిని చేర్పించిన కర్నూలు జిల్లా కలెక్టర్ పి కోటేశ్వరరావు అందరికీ ఆదర్శంగా నిలిచారని సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది .శుక్రవారం జిల్లా కలెక్టర్ తన కుమారుడు దివి ఆర్విన్ ను కర్నూలు నగరం లోని బుధవార పేట అంగన్వాడీ ప్రీ స్కూల్ లో చేర్పించారు. దివి ఆర్విన్ చక్కగా అంగన్వాడీ కేంద్రంలో పిల్లలతో కూర్చుని రంగులు దిద్దుకుంటూ , ఆట వస్తువులతో ఆడుకుంటున్న దృశ్యాలు అందరినీ అలరించాయి.కార్పొరేట్ పాఠశాలల్లో కన్నా ప్రభుత్వ పాఠశాలలే మిన్న అక్షర సత్యాన్ని కలెక్టర్ గుర్తించారు. మెరుగైన బోధన కోసం రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్ జగన్మోహన్ రెడ్డి విద్యా విధానంలో తీసుకొచ్చిన సమూలమైన మార్పులను గురించి కలెక్టర్ సమావేశాల్లో తరచు అధికారులతో చెప్తుంటారు . అంగన్వాడి ప్రీ స్కూల్ లో పిల్లలకు పౌష్ఠికాహారం అందించడంతో పాటు విలువలను కూడా నేర్పించాలని ఇటీవల జరిగిన మహిళ శిశు సంక్షేమ శాఖ అధికారుల సమావేశంలో ప్రత్యేకంగా ప్రస్తావించారు. అంగన్వాడీ కేంద్రాల్లో శిశువులకు ప్రభుత్వం కల్పించిన సౌకర్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కలెక్టర్ తన కుమారుడిని బ్రాండ్ అంబాసిడర్ గా చేశారు. స్వతహాగా కలెక్టర్ పి. కోటేశ్వర రావు ఆర్భాటాలకు దూరంగా, నిరాడంబరంగా ఉంటారు . ఈ చర్యతో అది నిరూపితం అయింది ..మాటల్లో కాకుండా చేతల్లో చూపించి, తన కుమారుణ్ణి అంగన్వాడీ కేంద్రంలో చేర్పిస్తూ కలెక్టర్ తీసుకున్న నిర్ణయం అందరికీ స్ఫూర్తిదాయకంగా నిలిచింది.. సుఖంగా ఫ్యాన్ కింద ఏసీలో చదవకుండా సర్కారీ బడుల్లో చదివితే కూడా రాణిస్తారని అని కలెక్టర్ సమాజానికి ఒక సందేశాన్ని పంపారు

# 15 న జరిగే ఆటో యూనియన్ న్యూ సిటీ నగర 2వ మహాసభలను జయప్రదం చేయండి -: సిఐటియు

కర్నూలు జూన్ 03 -: కర్నూలు నగరంలోని ని కార్మిక కర్షక భవన్ నందు శుక్రవారం ఆటో యూనియన్ సిఐటియు న్యూ సిటీ నగర రెండో మహాసభలను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు పి ఎస్ రాధాకృష్ణ కార్మికులకు పిలుపునిచ్చారు. ఆటో యూనియన్ న్యూ సిటీ నగర ఆఫీస్ బేరర్ సమావేశం నగర ఉపాధ్యక్షులు ా.మాలిక్ బాషా అధ్యక్షతన జరిగింది ఈ సమావేశాన్ని ఉద్దేశించి సిఐటియు జిల్లా అధ్యక్షులు ఖ.ా రాధాకృష్ణ.న్యూ సిటీ కార్యదర్శి ః.రాధాకృష్ణ మాట్లాడుతూ ఆటో డ్రైవర్ల సమస్యల కోసం నిరంతరం పోరాడే సంగం సిఐటియు అని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న విధానాల పై నిరంతరం పోరాటాలు నిర్వహిస్తు ఆటో డ్రైవర్ల కు అండగా ఉందని అన్నారు. ఆటోడ్రైవర్లకు భారంగా మారిన జీవో 21 రద్దు చేయాలని సంక్షేమ పథకాలు అమలు చేయాలని రానున్నకాలంలో పోరాటాలు నిర్వహిస్తామని అన్నారు. నెల 15న జరిగే ఆటో యూనియన్ సిఐటియు న్యూ సిటీ రెండో మహాసభలో చర్చించి ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని ఈ మహాసభలకు పెద్ద సంఖ్యలో ఆటోడ్రైవర్లు పాల్గొని జయప్రదం చేయాలని వారు ఆటో డ్రైవర్లకు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఆటో యూనియన్ న్యూ సిటీ నాయకులు.ా. షంషేర్ భాష ,నబీ, హుస్సేన్ వలి, బీ టి ఆర్ నగర్ మాలిక్ భాష, రవి పాల్గొన్నారు...

# ప్రజా సమస్యల పరిష్కారం కొరకే గడపగడపకు-మన ప్రభుత్వం కార్యక్రమం... ఎమ్మెల్యే శ్రీదేవీ



తుగ్గలి:ఉదయం న్యూస్: ప్రజా సమస్యల పరిష్కారం కొరకే గడపగడపకు-మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తుందని పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవీ తెలియజేశారు.శుక్రవారం రోజున మండల పరిధిలోని పెండేకల్ గ్రామంలో నిర్వహించిన గడపగడపకు-మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని గ్రామంలో పర్యటించి ప్రజా సమస్యలకు గుర్తించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ప్రజలకు హామీ ఇచ్చారు. గ్రామంలో గడపగడపకు వెళ్లి లబ్ధిదారులతో మాట్లాడి వైసీపీ ప్రభుత్వం అందించిన సంక్షేమ ఫలాలను గురించి వివరించారు.ప్రభుత్వం ఏర్పడిన మూడు సంవత్సరాలలో పార్టీలకు మరియు కులాలకు అతీతంగా సంక్షేమ ఫలాలను అందిస్తుందని ఆమె తెలియజేశారు.అనంతరం గ్రామ సచివాలయంలో మండల అధికారులతో మాట్లాడుతూ గ్రామంలో ఇళ్ళ సమస్య ఎక్కువుగా ఉన్నదని వాటిని త్వరలో పరిష్కరించాలని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో మారెళ్ళ సింగిల్ విండో అధ్యక్షులు అట్లా గోపాల్ రెడ్డి,పగిడిరాయ్ జగన్నాథ రెడ్డి,జిట్టా నాగేష్,జెడ్పీటీసీ పులికొండ నాయక్,నాగభూషణం రెడ్డి,పాటిల్ సుధాకర్ రెడ్డి,విష్ణు,సర్పంచ్ లీలావతి,ఎంపీటీసీ సభ్యులు పెద్ద రంగడు,వైస్ ఎంపిపి ఎర్ర నాగప్ప,వైఎస్సార్ పార్టీ నాయకులు బసి రెడ్డి,గౌరవ సలహాదారుడు మద్దిలేటి,దివాకర్ రెడ్డి,రఘు,గంగన్న,హరిజన ట్రాక్టర్ రంగన్న మరియు డిటి నిజాముద్దీన్, ఆర్ఐ సుధాకర్ రెడ్డి,విఆర్ఓ వెంకట రాముడు, ఈఓఆర్డి వీరరాజు,పంచాయితీ కార్యదర్శి అంకాలప్ప,మండల అధికారులు,సచివాలయ సిబ్బంది,గ్రామ వాలంటీర్లు,తుగ్గలి ఎస్.ఐ షామీర్ బాషా,తుగ్గలి పోలీస్ సిబ్బంది,మండల నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# తప్పుడు వాగ్దానాలతో అధికారంలోకి వచ్చిన జగన్ ప్రభుత్వం

**ఏఒక్క ఆమీలు**

**అమలు చేయని ప్రభుత్వం జగన్ ప్రభుత్వం**

**మంత్రాలయం టిడిపి ఇంచార్జ్ తిక్కా రెడ్డి**

మంత్రాలయం : పాదయాత్రలో తప్పుడు వాగ్దానాలతో అధికారంలోకి వచ్చిన జగన్మోహన్ రెడ్డి మూడు సంవత్సరాలలో ప్రజలకు ఉపయోగపడే పని ఏమీ చేయలేదని విమర్శించారు.బాదుడే బాదుడు కార్యక్రమంలో భాగంగా మంత్రాలయంలో తిక్కా రెడ్డి జగన్ ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. జగన్ ప్రభుత్వం వచ్చి మూడు సంవత్సరాలలో ప్రజలకు చేసింది ఏమి లేదని రాష్ట్రాన్నా అప్పుల్లో ముంచడం తప్ప విమర్శించారు. జగన్ ప్రభుత్వం వచ్చిన తరువాత అన్ని నిత్యావసర ధరలు పెట్రోల్, డీజిల్, గ్యాస్, మంచినూనె ధరలు విపరీతంగా పెరిగిపోయాయని, రైతులకు విద్యుత్ కోతలు కరెంట్ చార్జీలు విద్యుత్ మీటర్లుబిగించి మాట తప్పును-మడమ తిప్పును అని ప్రజలను నమ్మించి జగన్ మోసం చేశారని అన్నారు. మంత్రాలయం నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఇన్చార్జి పాలకుర్తి తిక్కారెడ్డి జగన్ ప్రభుత్వంపై తీవ్రంగా విరుచుకుపడ్డారు. తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు బాదుడే బాదుడు కార్యక్రమంలో భాగంగా మంత్రాలయంలో బాదుడే బాదుడు కార్యక్రమం నిర్వహించారు. బస్సుయాత్ర-కాస్త తుస్సు యాత్రగా మారిందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో పన్నగా వెంకటేశ్వశ్ స్వామి, అమర్నాథ్ రెడ్డి, కృష్ణ మోహన్ రెడ్డి, నరసింహులు,యేభు,తిక్కస్వామి గౌడ్, రవి, లక్ష్మయ్య, కల్లుదేవకుంట.భీమయ్య, మాలపల్లి లక్ష్మయ్య, రచ్చ మర్రి రామయ్య, వీరేశ్, ఉసేని, వెంకట రాముడు, తలారిహనుమంతు,వీరన్న గౌడు, బంగారయ్య, శివ,విజయ్ రామిరెడ్డి,ఐటీడీపి బృదం చిదానంద,టియన్యస్ శంకర్ నాయక్, తెలుగు యువత శివ,మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.



# 'పక్కా కమర్షియల్' నుంచి అందమైన 'అందాల రాశి' గీతం..!




మాచో స్టార్ గోపీచంద్ హీరోగా నటిస్తున్న లేటెస్ట్ మూవీ "పక్కా కమర్షియల్". మారుతి దర్శకత్వంలో తెరకెక్కుతోన్న ఈ కోర్టు డ్రామాలో అందాల భామ రాశీఖన్నా హీరోయిన్ గా నటిస్తోంది. ఇందులో గోపీచంద్ లాయర్ గా కనిపించనున్నారు. రిలీజ్ కు రెడీ అవుతోన్న ఈ సినిమాకు సంబంధించిన ప్రమోషన్స్ జోరుగా సాగుతున్నాయి.అగ్ర నిర్మాత అల్లు అరవింద్ సమర్పిస్తున్న 'పక్కా కమర్షియల్' సినిమా నుంచి ఇప్పటి వరకూ రిలీజైన ప్రమోషనల్ కంటెంట్ కు మంచి స్పందన లభించింది. దివంగత గేయ రచయిత సిరివెన్నెల సీతారామశాస్త్రి రాసిన టైటిల్ సాంగ్ ప్రేక్షకులను ఆకట్టుకుంది.ఈ నేపథ్యంలో మ్యూజికల్ ప్రమోషన్స్ లో భాగంగా తాజాగా 'అందాల రాశి' అనే సెకండ్ సింగిల్ లిరికల్ వీడియోని చిత్ర బృందం విడుదల చేసింది. 'అందాల రాశీ మేకప్ వేసి.. నాకోసం వచ్చేనే.. స్వర్గంలో కేసే నామీద వేసి భూమ్మీద మూసావే..' అంటూ సాగిన ఈ పాట శ్రోతలను అలరిస్తోంది.సినిమా నేపథ్యానికి తగ్గట్టుగా కోర్టు థీమ్ తో భారీ సెట్ లో విజువల్ గ్రాండియర్ గా 'అందాల రాశీ' పాటను షూట్ చేశారు. ఇందులో రాశీఖన్నా ఎంతో గ్లామరస్ గా కనిపించగా.. గోపీచంద్ హ్యాండ్సమ్ లుక్ తో అదరగొట్టాడు. ప్రధాన జంట కాస్ట్యూమ్స్ కూడా ఆకర్షణీయంగా ఉన్నాయి.జానీ మాస్టర్ ఈ సాంగ్ కు కొరియోగ్రఫీ చేశారు. ఇందులో గోపీచంద్ - రాశీ వేసిన సింపుల్ స్టెప్స్ ఆకట్టుకుంటున్నాయి. ఆర్ రవీందర్ దీనికి ఆర్ట్ డైరెక్టర్ గా వర్క్ చేశారు. సినిమాటోగ్రాఫర్ కరమ్ చావ్లా అద్భుతమైన విజువల్స్ అందించారు. ఎస్బీ ఉద్ధవ్ ఎడిటింగ్ నిర్వహించారు.'అందాల రాశి' గీతానికి జేక్స్ బిజోయ్ స్వరాలు సమకూర్చారు. లిరిసిస్ట్ కె.కె అర్థవంతమైన సాహిత్యం అందించగా.. సాయి చరణ్ భాస్కరుని - రమ్య బెహర కలిసి ఆలపించారు. జీఏ2 పిక్చర్స్ ఠ యూవీ క్రియేషన్స్ పతాకాలపై బన్నీ వాసు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ాఐఔ సహ నిర్మాత.'పక్కా కమర్షియల్' చిత్రాన్ని టైటిల్ కు తగ్గట్టుగానే పక్కా కమర్షియల్ హంగులతో రూపొందిస్తున్నారు. ఇప్పటికే వచ్చిన టీజర్ ఈ విషయాన్ని స్పష్టం చేసింది. 2022 జూలై 1న ప్రపంచ వ్యాప్తంగా ఈ సినిమా థియేటర్లలో విడుదల కాబోతోంది.

# 'విక్రమ్' లో సూర్య లుక్ చూశారా..?




విశ్వనటుడు కమల్ హాసన్ నటించిన పాన్ ఇండియా మూవీ "విక్రమ్" రిలీజ్ కు రెడీ అయింది. లోకేష్ కనగరాజ్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ యాక్షన్ థ్రిల్లర్.. జూన్ 3న ప్రపంచ వ్యాప్తంగా థియేటర్లలోకి రాబోతోంది.'విక్రమ్' సినిమాలో కమల్ తో పాటుగా తమిళ విలక్షణ నటుడు విజయ్ సేతుపతి మరియు మలయాళ స్టార్ ఫహాద్ ఫాజిల్ కీలక పాత్రలు పోషించారు. కోలీవుడ్ స్టార్ హీరో సూర్య అతిథి పాత్రలో కనిపించనున్నారు.మరో రెండు రోజుల్లో సినిమా విడుదల కానున్న నేపథ్యంలో తాజాగా 'విక్రమ్' నుంచి సూర్య ఇంటెన్స్ ఫస్ట్ లుక్ ని రివీల్ చేశారు. అయితే ఇందులో సూర్య క్యారెక్టర్ ఏంటనేది మాత్రం మేకర్స్ వెల్లడించలేదు.'విక్రమ్' సినిమాలో సూర్య చేసిన అతిథి పాత్ర ప్రేక్షకులకు ఆశ్చర్యాన్ని కలిగిస్తుందని.. దీనికి వచ్చే రెస్పాన్స్ ని బట్టి తన దగ్గర కొన్ని ప్లాన్స్ ఉన్నాయని దర్శకుడు లోకేష్ కనగరాజ్ తెలిపారు.తెలుగు తమిళ మలయాళ కన్నడ హిందీ భాషల్లో 'విక్రమ్' చిత్రాన్ని రిలీజ్ చేయనున్నారు. మిగతా భాషల సంగతి అటుంచితే తెలుగులో మాత్రం ఈ సినిమాకు ఆశించిన స్థాయిలో బజ్ లేదు.విక్రమ్ డబ్బింగ్ సినిమా కావడం.. హీరోలు ఇప్పుడు ఫార్మ్ లో లేకపోవడం.. ఇక్కడ పెద్దగా ప్రమోషన్స్ చేయకపోవడం కూడా దీనికి కారణం కావొచ్చు. ఈ నేపథ్యంలో తెలుగు రాష్ట్రాల్లో ఈ సినిమా అడ్వాన్స్ బుకింగ్స్ కూడా ఆశాజనకంగా లేవు. బుక్ మై షోలో అంతా గ్రీన్ గా కనిపిస్తోంది.మరోవైపు అదే రోజు రిలీజ్ అవుతున్న 'మేజర్' మూవీ అడ్వాన్స్ బుకింగ్స్ లో జోరు చూపిస్తోంది. రేపు హైదరాబాద్ లో 15 ప్రీమియర్ షోలు ప్లాన్ చేయగా.. ఇప్పటికే అన్నీ హౌస్ ఫుల్ అయ్యాయి. దీంతో మరికొన్ని షోలు యాడ్ చేసే పరిస్థితి ఏర్పడింది. మరి దీనికి పోటీగా రాబోతున్న 'విక్రమ్' ఎలాంటి ఫలితాన్ని అందుకుంటుందో చూడాలి.'విక్రమ్' చిత్రాన్ని రాజ్ కమల్ ఫిలిమ్స్ ఇంటర్నేషనల్ పతాకంపై కమల్ హాసన్ - ఆర్ మహేంద్రన్ సంయుక్తంగా నిర్మించారు. తెలుగులో శ్రేష్ఠ్ మూవీస్ బ్యానర్ పై యువ హీరో నితిన్ ఈ సినిమాని రిలీజ్ చేస్తున్నారు.

# 'నెట్ ఫ్లిక్స్' లో ఆర్ ఆర్ ఆర్ రికార్డు!

ఇండియాస్ మోస్ట్ అవైటెడ్ చిత్రంగా రిలీజ్ అయిన 'ఆర్ ఆర్ ఆర్' పాన్ ఇండియా కేటగిరీ సహా ఓవర్సీస్ లో ఎంత పెద్ద సక్సెస్ సాధించిందో తెలిసిందే. 1200 కోట్ల వసూళ్లతో భారతీయ చలన చిత్ర పరిశ్రమలో 'ఆర్ ఆర్ ఆర్' ఓ పేజీని లిఖించింది. కేవలం థియేట్రికల్ రన్ లోనే ఈ రేంజ్ వసూళ్లని సాధించడం విశేషం. ఇంకా డిజిటల్ రైట్స్ రూపంలో 'ఆర్ ఆర్ ఆర్' ఖాతాలో మరో రికార్డు అదనం.ఇక ఓటీటీలోనూ 'ఆర్ ఆర్ ఆర్' విజయ దుందుభీ మోగిస్తోంది. జీ-5 ఓటీటీ తెలుగు సహా అన్నిసౌత్ లాంగ్వె జెస్ రైట్స్ దక్కించుకుని రిలీజ్ చేసిన సంగతి తెలిసిందే. అక్కడా సినిమా కి మంచి ఆదరణ దక్కుతోంది.ఇక నెట్ ఫ్లిక్స్ హిందీ వెర్షన్ ని రిలీజ్ చేసింది. నెట్ ఫ్లిక్స్ దిగ్గజానికి భారతదేశం వెలుపలా భారీ స్థాయిని కలిగి ఉంది. ఇప్పుడీ క్రేజ్ తోనే 'ఆర్ ఆర్ ఆర్' నెట్ ఫ్లిక్స్ లోనే అద్భుతాలు సృష్టిస్తోంది.నెట్ ఫ్లిక్స్ లో సినిమా లైవ్ కి వచ్చినప్పటి నుంచి నాన్ ఇండియన్స్ నుంచి ఆర్ ఆర్ ఆర్ అసాధారణంగా దూసుకుపోతుంది. 18.36 మిలియన్ గంటల పాటు వీక్షించిన ఆంగ్లేతర చిత్రంగా 'ఆర్ ఆర్ ఆర్' అరుదైన రికార్డుని నెట్ ఫ్లిక్స్ లో సృష్టించింది. నెట్ ఫ్లిక్స్ స్ట్రీమింగ్ లోనే ఇది ఓ చరిత్ర అని అధికారికంగా ప్రకటించింది.ఇండియన్ సినిమాని ఇతర దేశస్తులు ఈ స్థాయిలో ఆదరించడం ఇదే తొలిసారి అని తెలుస్తోంది. అదే వారంలో నెట్ ఫ్లిక్స్ లో స్ట్రీమింగ్ అవుతున్న యాక్షన్ అడ్వెంచర్ మూవీ 'టాప్ గన్' 6.44 మిలియన్ గంటలు అత్యధికంగా వీక్షించిన చిత్రంగా ఉంది. ఇప్పుడా రికార్డులన్నింటిని 'ఆర్ ఆర్ ఆర్' తుడిచిపెట్టేసింది.'ఆర్ ఆర్ ఆర్' వీక్షణపై సోషల్ మీడియా వేదికగా సానుకూల సమీక్షలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో జూన్ 1 నుంచి ఆర్ ఆర్ ఆర్ కి మరింత ఆదరణ దక్కుతుందని స్ట్రీమింగ్ దిగ్గజం భావిస్తుంది. దాదాపు 100 థియేటర్లో 'ఆర్ ఆర్ ఆర్' రీరిలీజ్ అవుతుంది. అమెరికన్స్ నుంచి ఈసినిమా భారీ అదరణ దక్కుతుందని నిర్మాతలు భావిస్తున్నారు.



# మా వాళ్లంతా సూపర్.. ఏదో ఒకరోజు నేనూ ఐపీఎల్‌లో ఆడతా: ప్రొటీస్ కెప్టెన్



ఇండియన్ ప్రీమియర్ లీగ్‌లో తాను భాగస్వామ్యం కావాలనుకుంటున్నానని దక్షిణాఫ్రికా పరిమిత ఓవర్ల కెప్టెన్ తెంబా బవుమా అన్నాడు. ఏదో ఒకరోజు క్యాష్ రిచ్ లీగ్‌లో తప్పకుండా ఆడతానని ఆశాభావం వ్యక్తం చేశాడు. కాలం కలిసి వస్తే కెప్టెన్‌గా కూడా వ్యవహరించే అవకాశం రావాలని ఆశిస్తున్నానంటూ మనసులోని మాటను బయటపెట్టాడు.అయితే, అంతకంటే ముందు ఏదో ఒక జట్టులో ఆడే ఛాన్స్ రావాలని పేర్కొన్నాడు. కాగా ఐపీఎల్‌లో ఇప్పటికే చాలా మంది ప్రొటీస్ ఆటగాళ్లు తమ ప్రతిభను నిరూపించుకున్న విషయం తెలిసిందే. ఏబీ డివిలియర్స్ వంటి స్టార్ల నుంచి బేబీ ఏబీడీ డెవాల్డ్ బ్రెవిస్ వరకు ఈ జాబితాలో చాలా మందే ఉన్నారు. ముఖ్యంగా ఐపీఎల్-2022లో కగిసో రబడ, డేవిడ్ మిల్లర్, ఎయిడెన్ మార్కరమ్, మార్కో జాన్‌సెన్ తదితరులు తాము ప్రాతినిథ్యం వహించిన జట్ల విజయాల్లో తమ వంతు పాత్ర పోషించారు. ఇక మిల్లర్.. గుజరాత్ టైటాన్స్ ఫైనల్ చేరడంలో కీలకంగా వ్యవహరించాడు. టైటిల్ గెలిచిన జట్టులో భాగమయ్యాడు.ఈ క్రమంలో వీరందరిపై ప్రశంసలు కురిపించిన బవుమా.. ఐపీఎల్‌లో మంచి ప్రదర్శన నమోదు చేశారని పేర్కొన్నాడు. రబడ వంద వికెట్లు తీయడం గర్వంగా ఉందని పేర్కొన్నాడు. ఈ నేపథ్యంలో తానూ ఏదో ఒకరోజు ఐపీఎల్‌లో ఆడతానని ఈ 32 ఏళ్ల బ్యాటర్ పేర్కొన్నాడు.ఈ మేరకు.. "నేను కూడా అక్కడ ఆడతాను. మెరుగ్గా రాణిస్తే అవకాశాలు వాటంతట అవే వస్తాయి. నిజానికి అక్కడ ఓ జట్టుకు కెప్టెన్‌గా కూడా బాధ్యతలు నిర్వర్తించాలని ఉంది. ఇది నా ఫాంటసీ. అయితే, ముందు ఐపీఎల్‌లో ఏదో ఒక జట్టుకు ఆడి అనుభవం గడించాలి కదా" అని క్రికెట్‌మంత్లీతో బవుమా చెప్పుకొచ్చాడు.కాగా ఈ ఏడాది ఫిబ్రవరిలో జరిగిన మెగా వేలంలో 33 మంది ప్రొటీస్ ప్లేయర్లు తమ పేరు నమోదు చేసుకున్నారు. వీరిలో బవుమా లేకపోవడం గమనార్హం. ఇక జూన్ 9 నుంచి టీమిండియాతో టీ20 సిరీస్ ఆడేందుకు దక్షిణాఫ్రికా సన్నద్ధమవుతోంది.

EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY **AVULA VIJAYA BHASKARA REDDY** PRINTED AT **SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL - 518 001. ANDHRA PRADESH.**
**PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190**